



www.jananinadam.com

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

**సంప్రదించాల్సి నెంబర్**

**9550100197,9490111460**



సంపుటి: 1 సంచిక: 272 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | శుక్రవారం 25-04- 2025 | పేజీలు : 8 | వెల : రూ.2.00




ట్రంప్ నిర్ణయానికి కోర్టులో

# చుక్కెదురు

**స్వల్ప కారణాలతో విద్యార్థుల వీసాల రద్దు వాటిని పునరుద్ధరిస్తూ న్యాయస్థానం ఆదేశాలు**

వాషింగ్టన్,ఏప్రిల్24 : వీసాల రద్దుతో ఇబ్బంది పడ్డ భారత్ విద్యార్థులకు ఊరట దక్కింది. వీరితో పాటు పలుదేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమెరికాలో ట్రంప్ కార్యవర్గం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ అంటే స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అమెరికాలో చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అంటే ఓటిపి కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు- అక్కడ పని చేయవచ్చు.

- వారికి మద్దతు ఇస్తున్న వారిని సైతం వదలబోం
- కలలో కూడా ఊహించని విధంగా శిక్ష వేస్తాం
- వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ ఘాటు హెచ్చరిక



ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా

# వెతికి శిక్షిస్తాం

పట్నా, : ఉగ్రవాది ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. ఇది భారతీయ ఆత్మపై జరిగిన దాడి అని ప్రధాని అభివర్ణించారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లిచుకోక తప్పదన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు.





తెలంగాణలో ముదురుతున్న

# ఎండలు

**సాధారణం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్,ఏప్రిల్24 : తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

**దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలు తీరుస్తాం అక్కన్నపేట సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట,ఏప్రిల్24 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా చాలా మంది రైతులకు నష్టం జరిగిందని.. అలాంటి తప్పులు మళ్లీ జరగొద్దనే రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో భూ భారతి తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగానే భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం పాల్గొన్నారు.



భూభారతితో పారదర్శక

# విధానం

పదేళ్ల బీఆర్ఎస్ పాలన

# స్వర్ణయుగం

హైదరాబాద్,ఏప్రిల్24 : తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు-గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది.



2వ పేజీలో...

- గ్రామస్వరాజ్యం కోసం గాంధీ కలలను నిజం చేసాం
- ఉద్యమ కలను సాకారం చేసిన కెసిఆర్
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



కొత్తగూడెం మున్సిపాలిటీలో

## సమస్యలు పరిష్కరించాలని

2వ పేజీలో...

# సీపీఎం ధర్నా

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 24 : కొత్తగూడెం మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే.రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



తెలుగు రాష్ట్రాల్లో..

2వ పేజీలో...

# జోరుగా బెట్టింగ్..

హైదరాబాద్, విజయవాడ, ఏప్రిల్ 24: తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ భూతం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. ఎంతోమంది యువత ఆయుష్షును అర్థాంతరంగా ముగిసేలా చేసింది. ఇక ఏపీలోని చాలా బార్‌లలో రోజూ బెట్టింగ్ నడుస్తుంది. ప్రతీదగ్గర స్క్రీన్‌లు వేసి బెట్టింగ్‌లు జోరుగా నడిపిస్తున్నారు. దీంట్లో ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వాళ్లవే బార్లు, వాళ్లవే బెట్టింగులు అని తెలుస్తోంది. ఉదాహరణకు ఏలూరులో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బార్ ఉంది. ఓపెన్ ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.దీనిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఫలితంగా ఆన్ లైన్ బెట్టింగ్ కాస్త తగ్గింది. కానీ.. ఇన్నాళ్లు బెట్టింగ్ దోపిడీకి పాల్పడ్డ ముఠాలు ఇప్పుడు కొత్త దారిని ఎంచుకున్నాయి.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌పై గట్టి నిఘా ఉంది. దీంతో బుకీలు రూట్ మార్చి.. మళ్లీ పాత పద్ధతిని ఎంచుకున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు.

# పెండింగ్ సాదా బైనామాలకు భూ భారతితో పరిష్కారం



**–కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**–గంభీరావుపేట లో భూ భారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్**

**రాజన్న సిరిసిల్ల, :** పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులు నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతితో పరిష్కారం అవుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని స్పష్టం చేశారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని గుర్తు చేశారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో.. జోరుగా బెట్టింగ్...

**మొదటిపేజీ తరువాయి...**



ముఖ్యంగా ఏపీ–తెలంగాణ సరిహద్దు పట్టణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, వైరా ప్రాంతాల్లో గుట్టుగా బుకీలు దందా సాగిస్తున్నారు. ఇటు నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు అటు ఏపీ నుంచి ఇటు తెలంగాణ నుంచి బెట్టింగ్ రాయుళ్ళు వస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బార్లు, చాయ్ కేఫ్‌లు, రెస్టారెంట్లు, లాడ్జీలు ఆఫ్ లైన్ బెట్టింగ్‌కు వేదికలయ్యాయి. చాలా రోజులుగా పోలీసులు ఈ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై ఫోకస్ పెట్టడం లేదు. దీంతో బుకీలు రెచ్చిపోతున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ స్పాట్‌కు తక్కువ మంది వెళ్తున్నారు. అక్కడ ఉన్న బుకీలు, బ్రోకర్లు అమాయకులకు ఫోన్లు చేసి బెట్టింగ్ పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ విష సంస్కృతి మారుమూల పల్లెలకూ పాకింది. నెలకు రూ.10 వేలు సంపాదించే వారు కూడా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలవుతున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, వికెట్ టు వికెట్.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చెప్పలేని తిప్పలు పడుతున్నారు. ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనధికారిక వ్యక్తులు లేదా సంస్థలు బెట్టింగ్ నిర్వహిస్తే, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది. గెలిచినప్పటికీ, వారు చెల్లించకపోవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఎంత మొత్తం బెట్ వేస్తున్నారో ట్రాక్ చేయడం కష్టం. ఇది ఎక్కువ నష్టపోయేలా చేస్తుంది. బెట్టింగ్ వ్యసనంగా మారితే.. అది వ్యక్తిగత, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆఫ్‌లైన్‌లో ఈ వ్యసనం మరింత వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

# భూభారతితో పారదర్శక విధానం

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి అంటేనే ఆత్మగౌరవం. అలాంటి భూమి వివాదాల్లో ఉండకుండా సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకొచ్చామని, రైతులకు భూ భారతి ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ధరణిలో 30 లక్షల మంది భూ సమస్య ఉందని పిటిషన్ పెట్టుకున్నారు. ఆ సమస్యలు భూ భారతి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే గౌరవెల్లి కాలువల నిర్మాణం పూర్తవుతుందని.. ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ భూ సేకరణ సమయంలో కొంత మంది రైతులకు నష్టం జరిగిన వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు. భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సాదాబైనామాల కింద ఆన్‌లైన్‌లో ఉన్నటు-వంటి అర్హత గల దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు.

# ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి శిక్షిస్తాం

**మొదటిపేజీ తరువాయి...**

వారు భారత్ ఆత్మపై దాడి చేసే దుస్సాహసం చేశారు. ప్రపంచానికి మేము చెప్పేది ఒక్కటే.. ఉగ్రవాదులను, వారికి సాయమందించిన వారందరికీ గుర్తించి శిక్షిస్తాము. భూమి అంచుల వరకూ వారిని వెంటాడి పట్టుకుంటాము. ఉగ్రవాదంతో భారత్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయలేరని మోదీ నిప్పులు చెరిగారు. పహెల్గామ్‌లోని బైసారంలో పర్యటనకు వచ్చిన టూరిస్టులను మంగళవారం నాడు ఉగ్రవాదులు కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది మృతి చెందారు. ఈ దాడి కుట్రదారు పాక్‌పై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ కమిటీ– పాక్‌పై పలు చర్యలకు ఉపక్రమించింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడంతో పాటు– దౌత్య పరమైన చర్యలకు ఉపక్రమించింది. పాక్‌లో భారత సాయుధదళాల సలహాదారులను వెనక్కు పిలిపించుకోవడంతో పాటు– ఇక్కడున్న పాక్ రక్షణ శాఖ సలహాదారులను కూడా దేశం వీడాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదని మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ఉగ్రవాదుల ఘాతుకాన్ని ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో యావత్ దేశం ఏకమైందని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం



సమైక్య పాలనలో దశాబ్దాలపాటు– దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివిల్లైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు– మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.' అని కేటీ–ఆర్ నేటి దుస్థితిని వివరించారు. చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

# కొత్తగూడెం మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా



**మొదటిపేజీ తరువాయి...**

ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కిన్నెరసాని నీళ్లు ప్రతిరోజు అందించాలని, అలాగే డ్రైనేజీలు శుభ్రచేయాలని, అవసరమైన చోట కొత్త డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలం లేని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. 76 జీఓ క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించాలని, కోతులు, కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలి కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ మెంబర్ భూక్య రమేశ్, డి.వీరన్న, ఎస్.లక్ష్మి, నందిపాటు రమేశ్, జునుమాల నగేశ్ పాల్గొన్నారు.

## 'పహల్గామ్ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి'

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 24 : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కొత్తగూడెం జర్నలిస్టులు కోరారు. పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వారు నిరసన ప్రదర్శన చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. సుందరమైన కశ్మీర్‌లో రక్తపుటేరులు పారించిన ఉగ్రవాదులను క్షమించవద్దన్నారు. దేశంలో అలజడులు సృష్టించి భయానక వాతావరణాన్ని, మారణహోమాన్ని సృష్టించిన పాకిస్తాన్ టెర్రరిస్టులను వదలవద్దని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని కేంద్రాన్ని కోరారు. ఇటువంటి సమయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ చర్యలను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు.

# గ్రామాలు స్వయం ప్రతిపత్తి సాధించాలి

**జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో డిప్యూటి సిఎం పవన్**

అమరావతి,: గ్రామాలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలుగా ఏర్పడాలని గాంధీజీ చెప్పేవారని, తాను నగరాల్లో ఉన్నా.. పల్లెల్లో ఉండాలనే కోరిక ఉండేదని డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పల్లెల అభివృద్ధి ఎంతో కీలకం అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులు వాటికే ఖర్చు చేయాలని చెప్పానని.. అలాగే అమలు చేస్తున్నానని అన్నారు. ఈ విషయంలో తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శశిభూషణ్, కృష్ణ తేజ , ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సభ గురువారం అమరావతి లోని సికె కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిని చూపిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, మౌలిక వసతుల కల్పన వంటి పురోగతిని పవన్‌కు అధికారులు వివరించారు. అంతకుముందు కార్యక్రమంలో పహెల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అందరూ మౌనం పాటించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు– అయిన సందర్భంగా తాను పంచాయతీ రాజ్ శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని చెప్పారు. నేడు గ్రామాల్లో రోడ్లు, నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలొ కీలక పాత్ర వారిదేనన్నారు. ఈ అభివృద్ధి పనులకోసం నగలు తాకట్టు– పెట్టి పనులు చేశారని, నిధులు రావడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. దీని వల్ల కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వలేక పోయామన్నారు. త్వరలో నిధులు వస్తాయని... అందరికీ బిల్లులు చెల్లిస్తామని పవన్ కళ్యాణ్ భరోసా ఇస్తున్నామన్నారు. పంచాయతీల వ్యవస్థ బలోపేతం చేయడం కోసం తొలుత అధ్యయనం చేశానని, సిఫార్సులు, డబ్బులు లేకుండా బదిలీ ఉండదనే అభిప్రాయం ఉందన్నారు. ఎవరూ పైరవీలు చేయవద్దని తన పేషీ నుంచి ఆదేశాలు స్పష్టంగా ఇచ్చానని చెప్పారు. ఈసారి అన్ని స్థాయిల్లో అవినీతి లేకుండా బదిలీలు జరిగాయన్నారు. తాను సమర్థవంతంగా పని చేసే అధికారులను వెతికి పట్టు–కున్నానని, గతంలో నిర్లక్ష్యానికి గురి కాబడిన వారిని గుర్తించి ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చానని చెప్పారు. తనకు అనేక రూపాల్లో సిఫార్సులు వచ్చినా తాను నిబంధనల ప్రకారం వెళతానని చెప్పి అమలు చేశానన్నారు. కొన్ని గ్రామాలు వర్గ పోరు, కులాలపోరు వల్ల నష్టపోయాయని, కూటమికి చెందిన సర్పంచ్‌లు లేకపోయినా.. మేము ప్రజలకోసం ఆలోచన చేశామన్నారు. పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, ఎంపిపిలకు ఇచ్చే మర్యాద, గౌరవం ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి నిధులు కూడా మళ్లించిందని, రూ. 1120 కోట్లు మన ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధికి వినియోగించామని పవన్ చెప్పారు. 100 నుంచి పది వేలు, 250 నుంచి 25 వేలు పంచాయతీల కు పెంచామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీ అనే పదం వాడకూడదన్నారు. గ్రామాల అభివృద్ధికి వాడే శ్రామికులు అంటే బాగుంటు–ందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కూడా దీనిపై ఆలోచన చేయాలని, నరేగా శ్రామికులు గానే ఇక నుంచి అందరూ పిలవాలని, ఉపాధి శ్రామికులకు వంద రోజుల పనికల్పించామన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశామని, రూ. 10,690 కోట్లు– తొమ్మిది నెలల పాలనలో ఖర్చు చేసి గ్రామాలు అభివృద్ధి చేశామన్నారు. రూ. 1005 కోట్లతో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి చేశామన్నారు. ఏపీ అభివృద్ధిలో పంచాయతీ రాజ్ శాఖ పని తీరు చాలా కీలకమని, ఉద్యోగులు, సిబ్బందికి మేము ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# ట్రంప్ నిర్ణయానికి కోర్టులో చుక్కెదురు

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సమయాన్ని వారు హెచ్–1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ– స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ తీవ్ర నేరాలు చేయకపో యినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దయిన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరి కా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటున్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తారు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు, చైనీయులు, నేపాలీలు, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ వాసులున్నారు.

# ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి పూర్తి ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి24: ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా అందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి సంతోష్, టాస్క్ ఆర్.సి. మేనేజర్ జి.సాయికుమార్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉ పాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి, సి++, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ (ఎ,ఆర్), ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థుల వయస్సు 18-30 సం,,ల మధ్య ఉండాలని డిగ్రీ, డిప్లొమా, బి.టెక్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 28వ తేదీన శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లపనులు ప్రారంభించాలి

## అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**జననినాదం,లింగాపూర్,సిర్పూర్(యు)24:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన లింగాపూర్ మండలంలోని జాముల్లోరా గ్రామ పంచాయతీలో గురువారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల మంజూరైన వారు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. నిబంధనల ప్రకారం డబ్బులు. చెల్లిస్తామని తెలిపారు. డబ్బులు లేక పోవడంతో పనులు చేపట్టడం లేదని పలువురు ఆయనకు వివరించారు. దీంతో మహిళా సంఘాల ద్వారా రుణాలను మంజూరు చేయించాలని ఐకేపీ ఏపీఎంను ఆదేశించారు. అనంతరం గ్రామానికి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని పరిశీలించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. కార్యక్రమంలో మిషన్ భగీరథ



డీఈ రాకేశ్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ నరేష్, ఎంపీడీవో రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో చేపల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్

**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి24:** వేసవి వాతావరణ పరిస్థితులలో చేపల పెంపకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు చేపల పెంపకాన్ని ప్రభావితం చేస్తాయని, జలాశయాలలో నీటి మట్టము క్రమేపి తగ్గుతుందని, ఈ విషయమై మత్స్యకారుల సంఘాలు, సభ్యులు జాగ్రత్తలు వహించాలని తెలిపారు. సంఘం పరిధిలో చెరువులు, కుంటలలో నీటి మట్టం తగ్గిన ఎడల త్వరగా చేపలు పట్టుకోవాలని, 2024-25 సంవత్సరానికి గాను లీసు (చెరువు రకం) చెల్లించి చేపలు పట్టుబడి చేయాలని తెలిపారు. జిల్లాలో అధికంగా వర్షాధార చెరువులు, కుంటలు ఉన్నాయని, చెరువులోని నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం, చేపల కదలికలు ప్రతి రోజు గమనించాలని, కొన్ని చేపలను పట్టి పెరుగుదల, రంగు, తోక, రెక్కల స్వభావము ఇతర లక్షణాలను పరిశీలించాలని, తేడా ఉన్నట్లయితే మత్స్యశాఖ అధికారి సలహాలు, సూచనలు తీసుకొని నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టి ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఉ దయం సమయంలో చెరువు పైభాగంలో చేపలు నోరు తెరుచుకొని తిరుగుతుంటే ప్రాణవాయువు కొరత ఉందని తెలుసుకొని చెరువులో నీరు పెట్టడం, పెద్దగా పెరిగిన చేపలను పట్టి విక్రయించాలని, తద్వారా చేపల సాంద్రత తగ్గడం వలన ప్రాణవాయువు కొరతను అధిగమించవచ్చని తెలిపారు. చెరువులో నీటి నాణ్యత తగ్గినప్పుడు సున్నాన్ని ఒక హెక్టారుకు 100 నుండి 250 కేజీల వరకు చల్లడంతో నాణ్యతతో పాటు ప్రాణవాయువు శాతం పెరిగి ఉదని సూచిక అదుపులో ఉంటుందని తెలిపారు. చెరువులో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, లేకపోతే రాత్రి సమయంలో అవి విడుదల చేసే కార్బన్-డై-ఆక్సైడ్ కారణంగా ప్రాణవాయువు కొరత ఏర్పడి చేపలు చనిపోయే ప్రమాదం ఉంటుందని, ఈ సందర్భంలో విషం కలిపారనే అపోహలను నమ్మకుండా నిజర్ధారణ చేసుకోవాలని తెలిపారు. వ్యాధితో చేపలు చనిపోయిన వెంటనే వాటిని నీటి నుండి తొలగించి చెరువుకు దూరంగా కాల్చివేయాలని / భూమిలో పూడ్చి వేయాలని, వెంటనే సున్నాన్ని ఒక హెక్టారుకు 100 నుండి 250 కేజీల మోతాదులో చల్లాలని, ఇంకా అదుపులోకి రాకుంటే నీటి నాణ్యత పెంచే రసాయనాలు బి.కె.సి. (బెంజాల్ కొలియం క్లోరైడ్)ను ఒక హెక్టార్కు ఒక లీటర్ చొప్పున నీటిలో కలిపి చెరువులో చల్లాలని, అయినప్పటికీ మార్పు లేకపోతే అంటీ బయోటిక్ మందులను సూచించిన మోతాదులో మేతతో పాటు కలిపి ఇవ్వాలని తెలిపారు. నీటిలో ప్రాణవాయువు పెంపొందించేందుకు చెరువులోని నీటిని మోటార్ల ద్వారా రీసైక్లింగ్ చేసుకున్న ఎడల విష వాయువులు తగ్గి ప్రాణవాయువు శాతం పెరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మత్స్యశాఖ సంఘం పరిధిలోని 368 చెరువులు, కుంటలలో చేపల రక్షణకు సూచనలు పాటించి రాబడి పొందాలని తెలిపారు.

# రామయ్య పల్లెలో జై బాపు జై భీమ్ జై సంహిదాన్



కమాన్ పూర్ఏప్రిల్ 24.: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామయ్య పల్లి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అంటూ మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ నినదించారు.. రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాప్పన్న మరియు రామయ్య పల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారీ ర్యాలీలో లిమంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఫోటోలు, రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ప్రజలకు రాజ్యాంగం విలువను తెలుపుతూ మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ....కేంద్ర బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తు, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని దేశ సమగ్రతను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదముతో పెద్ద ఎత్తున ఉద్యమిద్దమని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ గారు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అంటే ప్రధాని మోదీకి ఏమాత్రం విలువ లేదని, అందుకే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను కించపర్చే విధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారని మంథని బ్లాక్ ఆధ్యకులు తొట్ల తిరుపతి యాదవ్ మండిపడ్డారు. భారత రాజ్యాంగం అంటే బీజేపీ దృష్టిలో పుస్తకం మాత్రమేనని, కానీ తమ దృష్టిలో రాజ్యాంగం అంటే పవిత్ర గ్రంథం అని పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పేదలంటే మోదీకి పట్టింపే లేదని, ఆయన ధ్యాసంతా దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడంపైనే ఉందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ధ్వజమెత్తారు. లిఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య,తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు బావు రాజమల్లు యాదవ్,యూత్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు మోతుక్కూర్ అవినాష్ గౌడ్,మాజీ సర్పంచ్ రామ్మూర్తి,మాజీ జడ్పీటీసీ గట రమణ రెడీ ,మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బుద్దార్తి బుచ్చయ్య,మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య,మాజీ ఉప సర్పంచ్ నరేష్ యాదవ్,మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్,గొర్రె నరేష్ యాదవ్,పుల్లల కొమురయ్య,యూత్ కాంగ్రెస్ నాయకులు మట్ట రాజ్ కుమార్,ఆరెల్లి మహేందర్ గౌడ్,దేవునూరి రాజేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..




# ఉగ్రదాడికి పాల్పడటం సిగ్గుమాలిన చర్య

జననినాదం,బోథ్,సిర్పూర్(ము),ఏప్రిల్ 24:కాశ్మీర్ పహల్గాం లో పర్యాటకులపై ఉగ్ర దాడికి పాల్పడడం అమాయక చర్య అని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పర్యటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో అమాయకమైన 26 మంది మరణించిన వారికి నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ క్రొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, బీఆర్ఎస్ నాయకులతో కలసి క్రొవ్వొత్తులు పట్టి మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం మీడియాతో ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ కాశ్మీర్ లో గల పహల్గాంలో ఉగ్రదాడులకు పాల్పడటం సిగ్గుమాలిన చర్య అని బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండించారు.మృతి చెందిన వారిలో త్రివిధ దళాలకు చెందిన ఇండియన్ నేవిలో లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ సైతం ప్రాణాలుకోల్పోవడం దేశానికి




తీరని లోటు అని ఇలాంటి చర్యల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఈ సందర్భంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్లో ఉగ్రమూకల దాడి పైక్రొవ్వొత్తుల ర్యాలీ



**జననినాదం,సిర్పూర్(యు)24:** జమ్మూ కాశ్మీర్లో ని పహల్గాం ఉగ్రదాడిపై సిర్పూర్(యు) మండలకేంద్రంలోని గురువారం రాత్రి బిఆర్ఎస్ నాయుకులు జైనూర్ మర్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు,గాంధీ చౌక్ ఉగ్ర మూకల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని క్రొవ్వోత్తుల ర్యాలీ నిర్వహాచారు ఈ సందర్భంగా ఆత్రం భగవంత్‌రావుమాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో వహల్గాం ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మతం అడిగి మరీ మారణకాండ సృష్టించడం, పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి, ముస్లిం కాదని నిర్ధారించుకొని మరీ కాల్చడం అత్యంత హేయనీయమన్నారు. ఉగ్రముకల దాడి ఇదొక క్రూరమైన, అమానవీయమని , పర్యాటకులను అమాయక పౌరులను, ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని తెలిపారు. దాడి ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయ లేరని పేర్కొన్నారు. ఉగ్రవాదులు చేసిన దాడులకు మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల పట్ల భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఎస్ఐ రామకృష్ణ, శ్రీనివాష్,సుభాష్,కరాటే లక్ష్మన్, ఆనంద్‌రావు, నాగోరావు,మహిళలు పాల్గొన్నారు.

# అవంతికి లైన్ క్లియర్ అయినట్లేనా

విశాఖపట్టణం, ఏప్రిల్ 24: కూతురు కూటమిలో చేరితే మాజీ మంత్రి అవంతికి రూట్ క్లియర్ అయినట్లేనా? అవంతి కూటమిలో చేరేందుకు ద్వారాలు తెరిచినట్లేనా? ఇన్నాళ్లూ అవంతి దారెటని సోషల్ మీడియా లో చక్కర్లు కొట్టిన వార్తలకు కూతురి ఓటుతో సమాధానం దొరికినట్లే నా? వైసీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి అవంతి చూపంతా ఇప్పుడు కూటమివైపేనా? అంటే అవుననే సమాధానం రాజకీయవ ర్గాల్లోవిన్పిస్తోంది. స్టీల్ సిటీవిశాఖ నగరంలో పొలిటికల్ రూపు రేఖలు మారబోతున్నాయంట. 3రోజుల క్రితం జరిగిన జీవీఎంసీ మేయర్ అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌తో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా మారి పోయాయి. విశాఖ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడంతో జిల్లా పాలిటిక్స్ లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కూటమి ఖాతాలోకి విశాఖ మేయర్ పీఠంవచ్చి చరడంతో ఇన్నాళ్లూ ఒక లెక్క? ఇప్పుడొలెక్క మాదిరిగా మారిపోయాయి విశాఖ పాలిటిక్స్. అంతే కాదు? రాబోయేరోజుల్లో జిల్లా రాజకీయముఖచిత్రమే పూర్తిగా మార బోతుందన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చక్కర్లు కొడుతోంద టవిశాఖ మేయర్ పదవి కూటమికి దక్కడంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ కుమార్తె,.6వ జీవీఎంసీ కార్పొరేటర్ లక్ష్మి ప్రియాంక కీలకపాత్ర పోషించారు. ఆమె వేసిన ఓటుతోనే మేయర్ పీఠం కూటమి ఖాతాలోకి చేరిపోయింది. అప్పటివరకు వైసీపీలో ఉన్న ఆమె..పార్టీకి అండగా నిలబడాలని విప్ కూడా జారీ చేశారు. కానీ సీన్ కట్ చేస్తే? తీరా ఓటింగ్ వచ్చే సమయానికి ఒక్కసారిగా కూటమికి మద్దతు గా నిలిచారు.మ్యాజిక్ ఫిగర్ 74 చేరుకోవడానికి అవంతి కుమార్తె వేసిన ఓటు కూటమికి ఆక్సిజన్ మాదిరిగా మారిందని టాక్ విన్పిస్తోంది. అప్పటివరకు వైసీపీకి అండగా నిలబడాలని విప్ సైతం జారీ చేసిన లక్ష్మి ప్రియాంక.. కూటమికి సపోర్ట్ చేయడంతో అంతా అవాక్కయ్యారట. ఆ తర్వాత వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిం చిన ఆమె..ఇంకా కూటమిలో మాత్రం చేరలేదు.ఇక రేపో మాపో కూటమిలో లక్ష్మి ప్రియాంక చేరడం ఖాయమనే టాక్ జిల్లా రాజకీయా ల్లో కోడై కూస్తోంది. ఒకవేళ కుమార్తె టీడీపీలో చేరితే.. ఆమె తండ్రి అవంతి శ్రీనివాస్ కూడా కుమార్తె బాటలోనే పయనించి కూటమిలో చేరతారంటూ ఓ వార్త జిల్లా రాజకీయాల్లో చక్కర్లు కొడుతోందట. కూతురి బాటలోనే తండ్రి పయనం అంటూ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చర్చ జరుగుతోంది.మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్..గత డిసెంబరులో వైసీపీకి రాజీనామా చేశారు. ఇపుడు ఆయన కూటమి వైపే అడుగులు వేస్తున్నారని అంతా ప్రచారం సాగుతోంది. కుమార్తె కూటమిలోకి అడుగు పెట్టడం ఖాయమని..తండ్రి అవంతి కూడా కుమార్తె బాటలోనే కూటమిలోకి ఎంట్రీ ఉంటుందంటూ విశాఖలో టాక్ నడుస్తోంది. అవంతి శ్రీనివాసరావు తన 15 ఏళ్ళ రాజకీయ జీవితంలో నాలుగు పార్టీలు మారారని అంతా అంటున్నారు.ఆయన ఏ పార్టీకి గాలి ఉ ంటే ఆ వైపుగా మారే పొద్దు తిరుగుడు పువ్వు లాంటి వారని అంతా అనుకుంటున్నారు. ఆయనను రాజకీయంగా ప్రవేశం కల్పించి ఎమ్మెల్యేని చేసింది ప్రజారాజ్యం పార్టీ అని అంతా గుర్తు చేస్తున్నారంట. ఆ తర్వాత 2014లో ఆయన టీడీపీలో చేరి అనకాపల్లి ఎంపీగా గెలిచారు. తిరిగి అయిదేళ్ళు గడవకుండానే టీడీపీని వీడి 2019 ఎన్నికల సమయంలో వైసీపీలో చేరి మూడేళ్ళ పాటు మంత్రిగా కూడా పనిచేశారు. అంతేకాదు వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.కూటమి వైపు అడుగులు వేయాలని చూస్తున్న అవంతిపై జిల్లా రాజీకీయాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ఆయన రాజకీయంగా ఒక పార్టీలో నిలకడగా ఉండరని.. పదే పదే పార్టీలు మారడం ఆయనకు అలవాటే అని సందేహం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన రాజకీయ జీవితంలో ఎపుడూ విపక్ష ఎమ్మెల్యేగా లేరని గుర్తు చేస్తున్నారట.వైసీపీ హయాంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నపుడు చంద్రబాబు- లోకేష్ పవన్ ల మీద చేసిన కామెంట్స్ ని ఆయా పార్టీల నాయకులు మళ్ళీ గుర్తుచేస్తున్నారంట. అలాంటి వారిని పార్టీలో చేర్చుకోవద్దని పార్టీ పెద్దలను కోరుతున్నా రుట. మరి అవంతి శ్రీనివాస్ చివరకు ఏ పార్టీలో చేరతారనేది రాబోయే రోజుల్లో ఓ క్లారిటీ రానుందని తెలుస్తోంది. కుమార్తె చేరిన తర్వాత చేరతారా లేదా ఇద్దరూ ఒకేసారి పార్టీలో చేరతారా అన్నది చూడాల్సి ఉంది. అసలు తండ్రీకూతురు కూటమిలో చేరతారా లేదా అన్నది కూడా సస్పెన్స్ అంటూ కూడా ఓ చర్చ జరుగుతోంది.

## నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం




జననినాదం,సిర్పూర్(యు) మలేరియాకు కూడా ఒక దినం ఉన్నదోచ్...మలేరియా వ్యాధి నిర్మూలన, ప్రజలలో ఈ వ్యాధి పట్ల అవగాహనా కలిపించడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ప్రపంచ వ్యాప్తంగా, 106 దేశాల్లో 3.3 బిలియన్ ప్రజలు మలేరియా బారిన పడుతున్నారు. 2012లో,మలేరియా వలన 6,27,000మంది మర ణించారు. మరణించినవారిలో ఎక్కువగా ఆఫ్రికన్ పిల్లలు ఉన్నారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యదేశాలన్ని కలిసి ఈ ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏర్పాటుచేశాయి. ఈ దినాన్ని ప్రతిసంవత్స రం ఏప్రిల్ 25 జరుపుకుంటారు. ప్రపంచ దేశాలన్నింటిలో నైజీరియా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్‌కాంగో, మొజాంబిక్, బుర్కినా ఫాసో, సియర్రా లియోన్ వంటి ఐదు దేశాలుఎక్కువగా మలేరియావ్యాధి బారినపడ్డాయనిప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. తాజాగా 2015లో ప్రపంచవ్యాప్తంగా 429,000 మలేరియా మరణాలు, 212 మిలియన్ కొత్తకేసులు నమోదయ్యాయి.2010,2015 మధ్యకా లంలో కొత్త మలేరియా కేసుల రేటు ప్రపంచవ్యాప్తంగా 21 శాతం పడిపోవడమే కాకుండామలేరియామరణాల రేటు29శాతానికి తగ్గింది.

## జాబ్ మేళాలో 16 మంది ఎంపిక



కమాన్ పూర్ ఏప్రిల్ 24.కమాన్ పూర్ ( గుండారం) ప్రభుత్వ జూనియర్ కళ శాలలో ఎం ఎస్ ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళా లో 16మంది విద్యార్థులు ఉద్యోగాని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాశి మల్ల సుధాకర్ తెలిపారు. ఇందులో కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు 6 రౌండ్లలో పలు అంశాలపై పరిజ్ఞానాన్ని పరీక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థు లను ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఎంపికపై వారికి నెలకు రూ.15 వేల వేతనం తో పాటు వసతి (టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీసెస్)లో డిగ్రీ చదివే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ తెలిపారు. విద్యార్థులు లెర్నింగ్ అండ్ ఎర్నింగ్ పద్ధతిలో చదువుతూ తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలువాలని జాబ్ మేళా నిర్వహించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కళాశాల నుంచి ప్రముఖ ఫార్మా కంపెనీ లో ఉద్యోగాలు సాధించడం విశేషమని చెప్పారు. గుండారం కళాశాలలో ప్రవేశాలు తీసుకున్న విద్యార్థులకు ఉత్తమ భోధనతో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కంపెనీ ప్రతినిధి సుబ్రహ్మణ్యం తో కలిసి విద్యార్థులకు ఉద్యోగ ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాలిగం రమేష్, తిక్క రమేష్, సంజీవ్, బాబురావు, వంశీ రూప, వసిమా, తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ సంరక్షణ పాదయాత్ర



మెట్ పల్లి ఏప్రిల్ 24: జగిత్యాల జిల్లా, మెట్ పల్లి మండలంలో బండలింగాపూర్, రాజేశ్వర్రావుపేట, చెర్ల కొండాపూర్ గ్రామంలలో గురువారం జై బాపు ,జై భీమ్ ,జై సంవిధాన్ లో భాగంగా రాజ్యాంగ సంరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగం ఒక గొప్ప పవిత్ర గ్రంథమని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుని యొక్క బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరిమహేందర్ రెడ్డి, గండి హనుమాన్ చైర్మన్ ఏనుగు రామానుజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు జంగ స్వామి, గుడూరు తిరుపతి, ఏ భూమయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు జంగిట్ రాజేందర్ ,యూత్ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల రాహుల్ , ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి విజయ్ , రాజు , మనోజ్, మల్లయ్య, విశ్వతేజ్ , సత్తయ్య, తుకారం , చిన్నారెడ్డి, మారు ప్రతాప్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర**
**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి ఏప్రిల్ 24: రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులకు సూచించారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

# భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



ములుగు : ఈ నెల 27న జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట చలో వరంగల్ బి.ఆర్.ఎస్ పార్టీ 25 వ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఏటూరునాగారం మండల అధ్యక్షులు గడదాసు సునీల్ ఆవిష్కరించారు.అనంతరం ఏటూరునాగారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో పాలకులంతా తెలంగాణను అన్ని రంగాల్లో అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరు కోలేక తనకున్న అన్ని పదవులకు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 27.04.2001 తేదీన ఏర్పాటు చేసిన పార్టీయే బి ఆర్ ఎస్ పార్టీ అన్నారు. 14 సంవత్సరాల పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 10 సంవత్సరాల తెలంగాణ సుభిక్ష పాలన చేసిన నాయకుడు, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ఈనెల 27 న ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వరంగల్ లో జరిగే 25 సంవత్సరాల రజతోత్సవ సభను విజయవంతం చేయుటకు సబండ వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, ఎండి ఖాజాపాషా,,గండపల్లి నర్సయ్య, మేరుగు వేంకటేష్, దొడ్డ కృష్ణ, తాడూరి రఘు,మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పండ్లు మజ్జిగ పంపిణీ..



కమాన్ పూర్ ఏప్రిల్ 24: కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు మజ్జిగ పాకెట్లను మంచు మనోజ్ బాబు యువసేన ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు.మంచు మనోజ్ బాబు యువసేన సుమన్ బాబు ఆధ్వర్యంలో భూమా శోభా నాగిరెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాలు పండ్లు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది..ఈ సందర్భంగా మంచు మనోజ్ బాబు యువసేన సుమన్ బాబు మాట్లాడుతూ భూమా శోభా నాగిరెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు మంచి పనులు చేశారని వాళ్లను మర్చిపోలేని వ్యక్తుల్లు అని సుమన్ బాబు మాట్లాడటం జరిగింది.. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్ బాబు యువసేన యూత్ అండ్ వివిధ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

### రవితేజ విద్యాసంస్థల వారి 2024-25 పరీక్ష ఫలితాలపై మరియు విద్యా సంస్థ విజయాలు



తిరుపతి : తిరుపతి 25.04.25 ఈ సంవత్సర విద్య ఫలితాల్లో జి.తేజస్విని.577, కె. వేదవతి.576, జె.లోకేష్ కృష్ణ.572, పి.మోక్షిత.568. 20 మంది విద్యార్థుల్లో 14 మంది విద్యార్థులు 500 కు పైబడి మార్కులతో విజయబెరి మోగించారు ఈ క్రమంలో పిల్లల తల్లిదండ్రులు సిబ్బంది స్కూల్ యాజమాన్యం పిల్లలను అభినందించారు. అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయి వివరాలకు స్కూల్ ని సంప్రదించగలరు రవితేజ ఒలంపియాడ్ ఐఐటి క్యాంపస్ మంగళం బి టి ఆర్ కాలనీ సెకండ్ లైన్ త్వరపడండి.

## రామగిరి మండలం లో జై బాపు జై భీమ్ కార్యక్రమం



రామగిరి మండలంలోనీ రామయ్య పల్లెలో గురువారం జై బాపూ జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయి అని కూలంకషంగా తెలుసుకుని రాబోవు కాలాలకు రేషన్ కార్డులు గాని రైతు సంబంధం ఆర్థిక విషయాలను కాంగ్రెస్ పార్టీ అన్నిటిని ప్రజలకు చేరువ తీసుకొస్తుందని తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 16 నెలల కాలం లో రైతులకు రుణమాఫీ,సన్నవడ్లకు రైతులకు 500,బోనస్, తెల్ల రేషన్ కార్డ్ గల కుటుంబాలకు గృహ జ్యోతి, గ్యాస్ పథకం, సన్నబియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం రాబోవు రోజులలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు బాధ్యత వహిస్తూ ప్రతి పథకాన్ని అంచలవారిగా తెలంగాణ ప్రజలకు కుల,మాత,ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా లబ్ధిదారులకు పూర్తిగా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పక్షాన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్ ప్రజలకు సవివరంగా తెలియజేయడం జరిగింది.ఇందులో రామగిరి మండల రామయ్య పల్లె మాజీ సర్పంచులు ముఖ్య నాయకులు మాజీ ఎంపీటీసీలు జిల్లా యూత్ నాయకులు రామగిరి సంబంధించినటు వంటి ముఖ్య నాయకులు అంతా వచ్చి కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జై బాబు జై భీమ్ జై సమిధన కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బీరన్న కొల్పోత్సవాలు



కమాన్ పూర్ ఏప్రిల్ 24.: కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో వీరన్న ఉత్సవాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఇందులో భాగంగా బీరన్న ఆలయంలో వీరన్న విగ్రహంతో పాటు అక్క మహంకాళి, భైరవ విగ్రహాలను గురువారం వేదంపండితుల మంత్రో చరణాల మధ్య ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఈ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో అత్యధిక సంఖ్యలో భక్తజనులు హాజరైనారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## గడ్డి వాము దగ్ధం..

కొడిమ్యాల ఏప్రిల్ 24.: కొడిమ్యాల మండలం చెప్యాలగ్రామంలో గురువారం ప్రమాదవసత్తు గడ్డివాము దగ్ధం అయింది వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కాటంరాజి రెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో వరి కోయకాలు నిప్పు పెట్టి కాల్చి క్రమంలో ప్రమాద వసతు ఒకసారి గాలి రావడంతో పక్కనున్న టాక్టర్ వరిగడ్డి వాము దగ్ధమై కాలి బూడిద అయింది ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని రైతు తెలిపారు.



# సంపాదకీయం

## హద్దుల్లో ఉంటూ..పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామిలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టుల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు.ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి,సంక్షేమరంగాల్లో సమతుల్యతను పాటిస్తూ..ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి అసలుసిసలు కృషి చేయాలి. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చుకోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామిలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. ఉచిత పథకాలకు పాతరేయాలి. సన్న బియ్యం ఇస్తున్నామని చంకలు గుద్దుకోకుండా..అర్హులకు అదీ ధరలు పెంచి ఇవ్వాలి. ఈ క్రమంలోకాంగ్రెస్ నేతలు కూడా నిజాలు గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండదు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప మున్ముందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. బీఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా అన్నది పనుల్లో చూపాలి. ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. సిఎం రేవంత్ కూడా ప్రజలకు ఇచ్చిన హామిలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. బిఆర్ఎస్ అవినీతిని ఎండగట్టడమే పాలన కాదు. పనులు కూడా చేస్తూ పోవాలని గుర్తించాలి. ఎపిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగాన్ని గుర్తించాలి. చంద్రబాబు ప్రజల సంక్షేమం కోరి ముందుకు అడుగేస్తున్నారు. పెండింగ్ పనుల్లో వేగం పెంచారు. ఇచ్చినహామిలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేపట్టారు. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలకు పూనుకుంటున్నారు. ఈ క్రమంలో వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి.

జననినాదం





# ఉగ్ర ఘాతుకం!

కాశ్మీర్ పర్యాటకులపై మంగళవారం నాడు ఉగ్రవాదులు విరుచుకుపడి, 28 మందిని కర్కశంగా కాల్చి చంపిన దుర్మార్గ చర్య దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘాతుకాన్ని అన్ని పార్టీలూ ఏకకంఠంతో ఖండించాయి. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణం రద్దు తదితర చర్యల ద్వారా ఉగ్రవాదాన్ని అణచివేశామని, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పామని మోడీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న నేపథ్యంలో ఈ ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి తమ పనేనని ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్) అనే ఉగ్రవాద ముఠా ప్రకటించుకొంది. జమ్మూ కాశ్మీర్ స్వయంప్రతి పత్తిని రద్దు చేసిన తరువాత 2019లో ఈ సంస్థ ఏర్పడిందని, ఇది లష్కర్ తోయిబాకు అనుబంధంగా పనిచేస్తోందని మన నిఘా సంస్థలు ప్రకటించాయి. 2019లో 44 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న పుల్వామా ఉగ్రదాడి తరువాత.. ఎక్కువమందిని బలిగొన్న ఈ దుశ్చర్య మోడీ ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. మిలటరీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయన్న విషయం మరువరాదు. ప్రచారార్భాటాలకు పరిమితం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలతో పౌరులకు, పర్యాటకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఈ ఉగ్ర ఘాతుకం గుర్తు చేస్తోంది.

ఉగ్రదాడిలో రక్తమోడిన పహల్గాంలోని బైసరన్ ప్రాంతానికి మినీ స్విట్జర్లాండ్ అని పేరు. కనుచూపు మేరా అందమైన పచ్చిక బయళ్ళు, దట్టమైన పైన్ వృక్షాల సముదాయాలూ, వాటి నేపథ్యంలో ఎత్తయిన హిమనగాలూ ప్రకృతి ప్రేమికులకు అనంతమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. సముద్రమట్టానికి ఎనిమిది వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ ప్రాంతం నడి వేసవిలోనూ పది సెల్సియస్ డిగ్రీల లోపు ఉష్ణోగ్రతతో శీతల దేశాల్లో ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. అందువల్లనే ఏటా ఈ సీజన్లో వేలాదిమంది పర్యాటకులు బైసరన్‌ని సందర్శిస్తారు. అలాంటి చోట ఆనందంగా విహరిస్తున్న సందర్శకులపై ఉన్మాద మూక విచక్షణారహితంగా చేసిన దాడి.. మిగిలిన కుటుంబ సభ్యులకు జీవిత కాలపు భయానక దృశ్యం. కళ్లముందే భర్తను కోల్పోయి, నిస్ప్రాణగా మిగిలిన నవ వధువుబీ చూస్తుండగానే తండ్రిని కాల్చి చంపితే అమ్మ సందిట్లో బేలగా ఒదిగిన చిన్నారులు, భారత సైనికులు సాయుధులై రక్షణగా వచ్చినప్పుడు కూడా ఇంకా భయంలోనే ఉండి, 'చంపితే నన్ను చంపేయండి.. నా కూతురిని మాత్రం వదిలేయం డి.' అని ప్రాధేయపడుతున్న తల్లి .. ఉన్మాదులు సృష్టించిన అమానుష కృత్యానికి ఆనవాళ్ళు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులు చేయడం, సైనికులను, పౌరులను బలిగొనటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం సరిహద్దుకు ఆవల, ఈవల అప్పుడప్పుడు విధ్వంసక దుశ్చర్యలతో తన ఉనికిని చాటుకుంటోంది. దీనికి స్థానిక యువతలోని అసంతృప్తి, పరాయీకరణ, అనుమానిత నిఘా, నిరుద్యోగం వంటివి కారణమవుతున్నట్టు గతంలో అనేక అధ్యయనాలు వెల్లడి చేశాయి. దేశ సరిహద్దు ప్రాంతాల, పౌరుల అభివృద్ధికి పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అభివృద్ధి పథంలోకి మళ్లించటం ద్వారా ఉగ్రవాద సంస్థలకు ఊతం ఇవ్వని వాతావరణం నెలకొల్పాలి. ఏడు దశాబ్దాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న, ఉంటున్న పార్టీలు ఆ పనిని చిత్తశుద్ధితో చేయలేకపోయాయి. 370 అధికరణం రద్దు, ఆ తరువాత సాగించిన తీవ్ర నిర్బంధం కాశ్మీర్ ప్రజల మన్ననను పొందలేదని శాసనసభ ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఉగ్రవాద దాడులను మతకోణంలో చూడడం, విద్వేషాన్ని మరింత పెంచేలా ప్రచారం చేయడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదు. ఉన్మత్తత ఆవహించిన ఉగ్రవాదానికి, మతోన్మాదానికి మతమూ, ప్రాంతమూ అన్న విచక్షణ ఉండదు. తమ ఉన్మాదానికి అడ్డొచ్చిన ప్రతి మనిషీ తమకు శత్రువుగానే భావిస్తాయి. పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన హార్స్ రైడర్ సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఇంకో రెండు నెలల్లో అమర్‌నాథ్ యాత్ర జరగనున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి. పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో సహా ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ముష్కరులను కఠినంగా శిక్షించాలి. వైఫల్యం పునరావృతం కాకుండా తగు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలి.

## ధాన్యం దోపిడి..

## కల్లంలో ఆరబోసిన వడ్లను ఎత్తుకెళ్లిన దుండగులు



తిమ్మాపూర్, ఏప్రిల్24: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కల్లం నుంచి దొంగలు దోచుకెళ్లారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంఅలుగునూర్ గ్రామానికి చెందిన ముంజ రాములు అనే రైతు ఇటీవల వరి కోసి, అమ్ముకునేందుకు తేమ శాతం రావడానికి గ్రామంలో ఖాళీ స్థలంలో ఆరబెట్టుకున్నారు. ఈ క్రమంలో బుధవా రం అర్ధరాత్రి సమయంలో రాశి నుంచి సుమారు 60 బస్తాల వరకు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గుర్తించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు లు దర్యాప్తు ప్రారంభించారు. సుమారు రూ.50 వేల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధాన్యం ఎక్కడబడితే అక్కడ ఆరబోశామని, ఇలాంటి సంఘటన ఎప్పుడు చోటు చేసుకోలేదని గ్రామస్తులు వెల్లడించారు. ధాన్యం చోరీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాధిత రైతుతో పాటు స్థానికులు కోరుతున్నారు. కాగా.. కొన్ని రోజులుగా అలుగునూర్‌లో ద్విచక్ర వాహనాలు సైతం చోరీకి గురవుతున్నట్లు తెలిపారు. వరుసగా జరుగుతున్న చోరీలతో గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

# వాణిజ్య యుద్ధం అమెరికాకూ నష్టమే

'విమోచన దినం' పేరిట అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఏప్రిల్ 2న మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి అనేక పార్శ్వాలు ఉన్నాయి. చైనా, ఐరోపా యూనియన్, జపాన్, ఇండియా వంటి అతి పెద్ద దేశాలతోపాటు ప్రపంచంలో అతి పేద దేశమైన లెసోతో పాటు అనేక చిన్న దేశాల మీద కూడా వాణిజ్య సుంకాలు విధించాడు. ఇప్పుడంటే అమెరికా-చైనాలు దెబ్బకు దెబ్బ అన్నట్లుగా ఒకదాని మీద ఒకటి 145 శాతం సుంకాలు విధించుకున్నాయి. కాని లెసోతో మీద 50 శాతం సుంకాలు విధించే నాటికి చైనా మీద విధించిన సుంకాలు 45 శాతమే. ట్రంప్, అమెరికాల సుంకాల దెబ్బ పడని 'మిత్ర దేశం' అంటూ ఏదీ మిగలలేదు. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులు ఎక్కడికైనా సంచరించడానికి కల్పించుకున్న వెసులుబాటు కూడా ధనిక దేశాల్లోని పెట్టుబడిదారీ సంక్షోభాన్ని అధిగమించడానికి అక్కరకు రాకుండా పోయింది. అందుకే ఇప్పుడు ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా కొత్త వ్యూహాన్ని అనుసరించాలని ట్రంప్ భావిస్తున్నాడు. సుంకాల యుద్ధం ద్వారా బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్య ఆర్థిక వ్యవస్థను కొత్త మార్గం పట్టించవచ్చని ఊహిస్తున్నాడు.

అమెరికా ప్రస్తుతం అనేక దేశాలతో వాణిజ్య లోటు ఎదుర్కొంటున్నది. అంటే ఆ యా దేశాలకు అమెరికా చేసే ఎగుమతుల విలువ కన్నా ఆ యా దేశాల నుండి చేసుకుంటున్న దిగుమతుల విలువ ఎక్కువగా ఉంటుంది. దీనిని సరిదిద్దడానికే ట్రంప్ యంత్రాంగం సుంకాల పెంపును మార్గంగా ఎంచుకున్నది. అమెరికాతో వాణిజ్యం నెరపే ఏ దేశమైనా దానికి వాణిజ్య లోటు వున్నదా? మిగులు వున్నదా? అనే అంశంతో సంబంధం లేకుండా-కప్పం కట్టాల్సిందే. మాతో వ్యాపారం చేసే ఏ దేశమైనా మాకు లాభం చేకుర్చాల్సిందే అనేది ట్రంప్ వాదన. తద్వారా ప్రపంచ దేశాలతో అమెరికాకు ఉన్న భారీ వాణిజ్య లోటును పూడ్చుకోవాలని చూస్తున్నారు. వాస్తవానికి ఏ దేశానికైనా ఒక దేశంతో వాణిజ్య మిగులు ఉంటే ఇంకో దేశంతో వాణిజ్య లోటు ఉండనే ఉంటుంది. కానీ అమెరికా ప్రతి దేశంతో తనకు వాణిజ్య మిగులు ఉండాలని భావిస్తుంది. అందుకు సుంకాల విధింపును మార్గంగా ఎంచుకున్నది. అయితే ట్రంప్ వాణిజ్య వ్యూహం వికటించి అమెరికన్ స్టాక్ మార్కెట్, బాండ్ మార్కెట్ కుదేలైపోయాయి. ఈ అనూహ్య పరిణామాలతో ట్రంప్ సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేశాడు. అయితే అమెరికాతో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న చైనాతో సుంకాల యుద్ధం మాత్రం తీవ్రతరంగా కొనసాగుతున్నది. మిగిలిన దేశాల మెడల మీద ఈ సుంకాల కత్తి ఇంకా వేలాడుతూనే ఉన్నది. ట్రంప్ ఏకపక్షంగా విధించిన ఈ సుంకాల పర్యవసానంగా అమెరికన్ స్టాక్ మార్కెట్ పతనాన్ని చవిచూసింది. దీని ప్రభావం బాండ్ మార్కెట్ల (అమెరికా వివిధ దేశాల నుండి తెచ్చుకున్న అప్పులకుగానూ హామీగా జారీ చేసే సార్వభౌమ తాకట్టు పత్రాల అమ్మకాలు-కొనుగోళ్లు జరిగే మార్కెట్) మీద కూడా పడింది. ఇది స్టాక్ మార్కెట్ కన్నా అత్యంత కీలకమైనది. ఇది కూడా దెబ్బతినేసరికి ట్రంప్ వెనకడుగు వేశాడు. సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నా. ఈ 90 రోజుల్లోగా ప్రతి దేశం వచ్చి మాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిందే. అప్పటిదాకా ప్రతి దేశం పది శాతం ఫ్లాట్ రేటున సుంకాలు చెల్లించాల్సిందేనని ట్రంప్ ప్రకటించాడు. అంటే మన సినిమాల్లో చూపిస్తున్నట్లు మాఫియా డాన్ ఆధిపత్యాన్ని అంగీకరించడానికి అతని ముందు మోకరిల్లి చేతిని ముద్దాడినట్లు సంకాల తగ్గింపు కోరుకునే దేశాలన్నీ వచ్చి అమెరికన్ సామ్రాజ్య చక్రవర్తులుంగారుగా తనని తాను భావించుకుంటున్న ట్రంప్ ముందు సాగిలపడాలని కోరుకుంటున్నాడు. అయితే పది శాతం ఫ్లాట్ రేటు సుంకం మీద ఎలాంటి రాయితీ ఉండదని స్పష్టం చేశారు.ట్రంప్ విధించిన ఈ సుంకాల మూలంగా 2024లో 2.5 శాతంగా ఉన్న సుంకాలు ఒక్కసారిగా 22 శాతానికి పెరిగాయని, 1910 తర్వాత అమెరికా విధించిన సుంకాల్లో ఇదే అత్యధికమని 'ఫిచ్' రేటింగ్ కంపెనీ పేర్కొన్నది.చాలా దేశాలు అమెరికాతో వాణిజ్య చర్చలకు సిద్ధపడ్డాయి. కానీ చైనా మాత్రం ట్రంప్ ఆడమన్నట్లు ఆడడానికి సిద్ధపడకపోగా చైనా మీద అమెరికా ఎంత శాతం సుంకాలు విధిస్తే చైనా కూడా అమెరికా మీద అంతే సంకాలు విధిస్తూ వచ్చింది. చైనా అమెరికన్ దిగుమతుల మీద, అమెరికా చైనా ఎగుమతుల మీద 145 శాతం సుంకాలు విధించింది. అయితే ట్రంప్ తనదే పైచేయి అని చాటి చెప్పడానికి చైనా మీద సుంకాలు 245 శాతానికి పెంచినట్లు ప్రకటించాడు. కానీ చైనా మాత్రం ఈ పెంపు 'నామ్ కే వాస్తే' తప్పితే 145 శాతానికి మించి సుంకం విధించడం సాధ్యమయ్యే పని కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు నడుస్తున్న అంతర్జాతీయ వాణిజ్యం అంతా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) విధివిధానాలకు లోబడి ఉంది. ఇది రూపొందించింది కూడా సామ్రాజ్యవాద శక్తులే. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అగ్రగామిగా ఉన్నందున డబ్ల్యుటిఓ చట్రం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని శాశ్వతంగా తాను శాసించగలనని అమెరికా భావించింది. అంతర్జాతీయంగా శ్రామికవర్గంలో ఉన్న విభజన కారణంగా పేద దేశాలు నాసిరకం సాంకేతికత కూడిన సరుకులు ఉత్పత్తి చేస్తే ఆధునిక సాంకేతికత ద్వారా తాను ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్‌లో గిరాకీ ఏర్పడి మంచి లాభాలు సంపాదించుకోవచ్చని తలచింది. పేద దేశాలు ఎంత సాంకేతిక అభివృద్ధి సాధించినా తాము వాటికన్నా పదడుగులు ముందే ఉంటామని సామ్రాజ్యవాద దేశాలు ధీమాగా ఉండేవి. పరిశ్రమలు మాకు, వ్యవసాయం గనుల తవ్వకాలు మీకు అని వలస పాలనాకాలం నాటి విధానాన్ని మక్కికి మక్కీగా కాదు గానీ దాదాపుగా అలాంటి నమూనానే డబ్ల్యుటిఓ ద్వారా బలహీన, పేద దేశాల మీద రుద్దారు. పనిలో పనిగా అమెరికా తన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి సబ్సిడీలు ఇచ్చుకునే అవకాశాన్ని అట్టేపెట్టుకున్నది. డబ్ల్యుటిఓ చట్రం పరిధిలో కూడా శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసుకుని, వాటిని పారిశ్రామిక రంగంతో అనుసంధానించుకుని సామ్రాజ్యవాద దేశాలు ఊహించినదానికన్నా వేగంగా, శీఘ్రంగా అంతర్జాతీయ వాణిజ్యంలో పై మెట్టుకు ఎదగడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకునేందుకు అవకాశం ఉన్నది. సాంకేతిక అభివృద్ధి సాధించడానికి మానవ వనరులు, విజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి రాజ్యం ప్రయత్నపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులు పెట్టడానికి, టెక్ రంగానికి రక్షణలు కల్పించడానికి, రాజ్యం ఏ మేరకు సిద్ధపడితే ఆ మేరకు సానుకూల ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. డబ్ల్యుటిఓ లో ఉన్న సంక్లిష్టతలు, ముఖ్యంగా మేధో హక్కుల విషయంలో ఉన్న అవాంతరాలన్నింటినీ అధిగమించి భారతదేశం ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలిచిందన్న అంశాన్ని మనం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అయితే మన ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరి కారణంగా మన అగ్రగామి స్థానాన్ని చైనాకు వదులుకునే దశకు చేరుకున్నాం. మందుల తయారీకి కీలకంగా అవసరమైన ఎ.పి.ఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్)ల ఉత్పత్తి మీద మన దేశం శ్రద్ధ పెట్టకపోవడం మూలంగా చాలా వరకు మన ఫార్మా రంగం చైనా దిగుమతుల మీదే ఆధారపడి ఉన్నది. ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా మన దృష్టి మసకబారిపోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు-దక్షిణ కొరియా, చైనాలు సహా- సి.డాట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకుని సాంకేతిక రంగంలో శీఘ్రగతిన అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ మన పాలకులు సాఫ్ట్‌వేర్ రంగం మీద ఆధారపడితే చాలు, త్వరితగతిన అభివృద్ధి చెందుతాం అని సరిపెట్టుకున్నారు తప్పితే ఏకకాలంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలను అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచన చెయ్యలేదు. అందుకు కారణం పాలక వర్గాల బ్రాహ్మణవాద భావజాలమే. రెక్కల కష్టంకన్నా బుద్ధి బలమే గొప్పది అన్న శ్రమను గౌరవించలేని సంస్కృతే కారణం. ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య, మీడియా రంగం మరీ ముఖ్యంగా ఫైనాన్షియల్ టైమ్స్, బ్లూమ్‌బర్గ్ తదితర పశ్చిమ దేశాల మీడియా చైనా మీద అమెరికా ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం అమెరికాకే ఎసరు తెస్తుందని ప్రచారం చెయ్యడం అసక్తికరంగా మారింది. 'ఎకనమిస్టు' పత్రిక అయితే 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అన్న ట్రంప్ నినాదాన్ని వెక్కిరిస్తూ ఈ సుంకాల యుద్ధంలో అమెరికా విల్ మేక్ చైనా గ్రేట్ ఎగైన్ (అమెరికాయే చైనాను గొప్ప శక్తిగా తీర్చిదిద్దుతుంది.) అన్న పతాక శీర్షికతో వార్త ఇచ్చింది. వాస్తవానికి వాణిజ్య యుద్ధాలు అన్ని దేశాలకూ నష్టంగా పరిణమిస్తాయని గుర్తించడం ముఖ్యం. అయితే ఏ దేశం తీవ్రంగా నష్టపోయే అవకాశం వుందనేది కూడా అంతే ముఖ్యంగా గుర్తించాల్సిన అంశం. అన్ని పక్షాలా నష్టం వాటిల్లే ఈ యుద్ధంలో ప్రధానంగా చైనా ఎక్కువగా నష్టపోతుందని ట్రంప్ అంచనా.ట్రంప్, అతని ఆర్థిక సలహాదారులు ఈ రకమైన అంచనాకు రావడానికి గల కారణం అమెరికా చైనాకు చేసే ఎగుమతుల కన్నా రెండింతలు దిగుమతులు చేసుకుంటున్నది. కాబట్టి చైనా సరుకులు అమెరికన్ మార్కెట్‌లో అమ్ముడు పోనంత సుంకాలు విధిస్తే చైనా ఎగుమతులు దెబ్బతిని అంతిమంగా నష్టపోతుందన్న సాదాసీదా సిద్ధాంతాన్ని నమ్మడమే. అమెరికన్ మేధో మండలిలో భాగంగా వున్న విదేశాంగ వ్యవహారాల మండలి తరపున ప్రచురించే పత్రిక 'ఫారిన్ ఎఫైర్స్'లో ఆడమ్ పోజెన్ రాసిన వ్యాసాలు కానీ, అమెరికన్ ప్రధాన స్రవంతి మీడియాలో గానీ ఈ విశ్లేషణలే కనబడతాయి. కానీ వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. చైనా తన ఎగుమతులను వివిధ ప్రపంచ దేశాలకు మళ్ళించుకోవచ్చు. అలాగే పెద్ద కష్టపడకుండా దేశవాళీ వినియోగాన్నే మరింత విస్తరించుకోవచ్చు. కానీ ప్రపంచంలోనే అగ్రగామి సరఫరాదారుగా ఉన్న చైనా స్థానాన్ని ప్రస్తుతం ఏ దేశమూ భర్తీ చేసే స్థితిలోగాని, స్థాయిలోగానీ లేవు. అమెరికా నుండి చైనా సోయా, నూనె విత్తనాలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను భారీగా దిగుమతి చేసుకుంటున్నది. చైనా ఈ దిగుమతులను నిలిపివేస్తే ట్రంప్‌కు బలమైన మద్దతుగల ఫ్లోరిడా, నెబ్రాస్కా వంటి రాష్ట్రాలు దెబ్బతినిపోతాయి. ఈ వాణిజ్య యుద్ధంలో అమెరికా అనూహ్యంగా నష్టపోతుంది. ఇప్పటికే చైనా అమెరికా నుండి సోయా దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. ఇండోనేషియా నుండి కావాల్సిన సోయా దిగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నది. చైనా అధ్యక్షుడు ఇండోనేషియా, వియత్నాం తదితర దేశాల పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశం ఇదే. వాణిజ్య యుద్ధాల్లో మనం ఎంతో నష్టపోతున్నా ఎదుటి వాళ్ళను అంతకంతా నష్టపరిచే 'సామర్థ్యం' ఏ దేశానికి ఎక్కువగా ఉంటుందో చివరికి ఆ దేశానిదే పైచెయ్యి అవుతుంది. అలాంటి 'సామర్థ్యం' ప్రస్తుతానికి చైనాకే ఉన్నదని ఆడమ్ పోజెన్ కూడా స్పష్టం చేశాడు. ప్రస్తుతం చైనా మీద ఎక్కుపెట్టిన ఈ వాణిజ్య యుద్ధంలో యాపిల్ తదితర ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి పరిశ్రమలు దెబ్బతిని పోయే అవకాశం ఉందని గ్రహించాక ఐఫోన్లు, కంప్యూటర్లు ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన విడిభాగాల దిగుమతుల మీద 145 శాతం సుంకాలను ట్రంప్ ఉపసంహరించుకున్నాడు. చైనా-అమెరికాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగినంత కాలం అమెరికన్ వస్తూత్పత్తి రంగం మీద వేటు కత్తి వేలాడుతూ ఉన్నట్లే. తక్కువ సుంకాలతో అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధి సాధించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన డబ్ల్యుటిఓ శకం ముగిసిపోయిందనడానికి ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధమే ఒక సూచిక. చైనా, దక్షిణ కొరియా, భారత్ సహా మరిన్ని తూర్పు ఆసియా దేశాలు-ఇంకా సూక్ష్మంగా చెప్పుకోవాలంటే-ఒకప్పటి వలస దేశాలు అభివృద్ధి కావడం వలస పాలకులైన సామ్రాజ్యవాద దేశాలకు కంటగింపుగా మారింది. పతనాభిముఖంగా ఉన్నప్పటికీ ఇంకా ప్రధాన ఆర్థిక శక్తిగా ఉన్న దేశాలు అంతర్జాతీయ వాణిజ్య సరళిని పూర్తిగా తమ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకోవాలని ప్రయత్నించే క్రమంలో 'బొమ్మాబొరుసు' ఆట మొదలుపెట్టాయి. 'బొమ్మ పడితే మేం గెలిచినట్లు, బొరుసు పడితే మీరు ఓడినట్లు' అన్న తొండాట ఆడడానికి పూనుకున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు ఈ వాణిజ్య యుద్ధంలో గెలిచే అవకాశాలు లేవు కానీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లేలా చేస్తాయి. ఈ సాకుతోనే ప్రపంచ దేశాలను 'బ్లాక్ మెయిల్' చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. సైనిక పరంగా బలంగా ఉన్నాం కాబట్టి 'ఈ వాణిజ్య యుద్ధంలో నెగ్గకపోతే సైనిక యుద్ధం ద్వారా అయినా పై చెయ్యి సాధిస్తాం' అని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఫ్రాన్స్‌ను పరిపాలించిన 15వ లూయిస్ చక్రవర్తి 'నేను పోతే, ఉత్పాతమే' అని బలంగా విశ్వసంచేవాడు. ఆ విశ్వాసంతో చేసిన అడ్డగోలు పరిపాలన ఫ్రెంచి విప్లవానికి దారి తీసింది. రియల్ ఎస్టేట్ రంగ యజమానిగా ట్రంప్ ఆరుసార్లు దివాళా పిటిషన్లు వేసినా విజయవంతమైన వ్యాపారవేత్తగా కొనసాగాడు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దివాళా తీయిస్తే ఊరట కల్పించడానికి ఏ కోర్టులూ లేవు, రావు. కాబట్టి ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం అమెరికాతో పాటు మనందరికీ నష్టం వాటిల్లేలా చేస్తుంది. అందుకే ట్రంప్ సుంకాల యుద్ధాన్ని వ్యతిరేకించాలి.

## భారత వృద్ధి అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జిడిపి 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. భారత్‌లో ప్రయివేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు నెమ్మదించడం వల్ల గడిచిన 2024-25లోనూ వృద్ధి నిరాశపర్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వం తన లక్ష్యాలను చేరుకో లేదని వెల్లడించింది. గడిచిన 2024-25లో జిడిపి 6.5 శాతానికి మందగించనుందని విశ్లేషించింది. ఇంతక్రితం రోజూ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా భారత జిడిపి అంచనాలకు కోత పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత 2025-26లో వృద్ధి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని.. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.




# నాటి పాలకుల పాపమే నేటి కాశ్మీర్ హింస !



దేశ విభజన తెచ్చి పెట్టిన చిచ్చు ఇంకా రావణ కాష్టంలా కాలుతూనే ఉంది. మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. ఆనాడు దేశాన్ని విభజించకుండా మహాత్ముడు కూడా అడ్డుకోలేక పోయాడు. కేవలం నెహ్రూకు ప్రధాని పదవి కావాలన్న పట్టుదలతో దేశం ముక్కలైనా ఫర్వాలేదన్న రీతిలో ఆనాడు వ్యవహరించారు. దాని ఫలితాలను నేటికీ అనుభవిస్తున్నారు. సరిగ్గా దేశ విభజన జరగక పోడం, కాశ్మీర్ విషయంలో నాన్చివేత ధోరణి, 370 అధికరణ, యుద్ధాల్లో ఓడిన పాక్‌ను దయతలచి వదిలి పెట్టడం లాంటివన్నీ ఇవాళ మనకు గుదిబండగా మారాయి. ఆనాడే పటిష్టమైన విధానాలు అవలంబించి, ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని, పక్కాగా విభజన ఒప్పందాలు చేసుకుని ఉంటే ఇవాళ పాక్ తీవ్రవాదం నుంచి ముప్పును ఎదుర్కొని ఉండేవారం కాదు. ఆనాటి పాలకులు దూరదృష్టి లోపం కారణంగా దేశం ఇవాళ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.ఇకపోతే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దయితే స్వాగతించాల్సిన కాంగ్రెస్ ఇతర పార్టీలు, ఎంఐఎం వంటి మతఛాందస పార్టీలు సంకుచిత రాజకీయాలు ప్రదర్శించాయి. ఇప్పటికీ ప్రదర్శిస్తున్నాయి. లక్షలాది మంది కాశ్మీరీ పండిట్లను ఊచకోత కోసినా, మతమార్పిళ్లు చేసినా పట్టించుకోని కాంగ్రెస్ తదితర పార్టీలు ఆర్టికల్ 370 గురించి చేసిన ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్నాయి. ఈ విషయంలో ఉగ్రవాదులకు అండ దక్కుతుం దంటే అది మన పార్టీలు అవలంబిస్తున్న రాజకీయ వైఖరి అని చెప్పక తప్పదు. తాజాగా కాశ్మీర్‌లో నరమేథం అన్నది కేవలం... ఉగ్రదాడిగా చూడరాదు. పనిగట్టుకుని హిందువులే లక్ష్యంగా చేసిన దాడి. ఇది ముస్లిం ఉగ్రవాదుల పనే అయినా...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం దీనిని ఖండించాలి. ఇలాంటి మతఛాందసాన్ని ఒప్పుకోబో మని ఉగ్రవాదులకు సందేశం ఇవ్వాలి. అలా చేయకుంటే వారి నిజాయితీ లేనివారుగా గుర్తించాలి. ముందుగా మనదేశంలో ఉన్న ముస్లిం పార్టీలు, ఎంఐఎం లాంటి పార్టీలు ఇందుకు బహిరంగా ప్రకటనలు చేసి ఉగ్రవాదుల దుశ్చర్యలను నిలదీయాలి. నిరసించాలి. పాలకపక్షంగా ఉన్న ఫరూక్ అబ్దుల్లా పార్టీ, మెహబూబా ముఫ్తీ పార్టీలు కూడా అసవరమైన నిరసన ప్రదర్శనలు చేయాలి. పాక్ తీరును ఎండగట్టాలి. కానీ పాక్ పాటపాడే వీరు అలా చేస్తారని అనుకోవడం భ్రమే అవుతుంది. కశ్మీర్ భూమిపై మరోసారి భారతీయుల ముఖ్యంగా హిందువలను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడిని ఏ మాత్రం క్షమించ రాని నేరంగా చూడాలి. కాశ్మీర్‌లోనే కాదు..దేశంలో ఉగ్రవాదుల చర్యలనుఉపేక్షించరాదు. శాంతి వచనాలుపలకుతూ పోతేవారికి బుద్ధి రాదు. సెలవుల్లో ఆహ్లాదంగా గడుపుదామని పహల్గామ్ సందర్శించడానికి వెళ్లిన పర్యాటకులు లక్ష్యంగా ముష్కర మూక జరిపిన దాడిని ఒక్క ఖండనతో వదిలిపెట్టరాదు. కొత్తగా పెళ్లయిన జంటలు ఆనందంగా కాలక్షేపం చేద్దామని వెళితే భర్త కాటికి చేరగా భార్య గూడు చెదరి కన్నీరు మున్నీరయ్యింది. ఇప్పటివరకు కాశ్మీర్‌లో పర్యాట కులపై జరిగిన అతిపెద్ద ఉగ్రవాద దాడిగా దీనిని పరిగణిస్తున్నారు. ఇందులో 28 మంది మరణించిన తీరు ఉగ్రవాదుల రాక్షస కాండకు నిదర్శనంగా చూడాలి. కాందహార్ విమానం హైజాక్ చేసినప్పుడు కూడా ఇలాగే ఉగ్రమూకలు ఎందరినో పొట్టన పెట్టుకున్నారు. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని స్పష్టమయ్యింది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది వారికోసం గాలిస్తున్నారు. అయితే.. ఇప్పుడు ఈ దాడి వెనక పాకిస్థాన్ హస్తం ఉందన్నదానికి అనుమానాలు అక్కర్లేదు. మనదేశంలో ఏ దాడి జరిగినా దాని మూలాలు అక్కడే ఉంటున్నాయి. ఇటీవల దాయాది దేశంపాక్ ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అది తమ జీవనాడి అని, దానిని మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. విదేశాల్లో నివసిస్తోన్న పాకిస్థానీయులంతా దేశ రాయబారులు. మీరు ఉన్నతమైన భావజాలం, సంస్కృతికి చెందినవారనే విషయాన్ని మర్చిపోకూడదు. మీరు మీ పిల్లలకు పాక్ స్టోరీ చెప్పాలి. హిందువులతో పోలిస్తే మనం భిన్నమని మన పూర్వీకులు భావించారు. మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, ఆశయాలు భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది వేసింది. ఈ దేశం ఏర్పాటు– కోసం మన పూర్వీకులు ఎంతో పోరాడారు. ఈ స్టోరీని తర్వాత తరాలకు చెప్పడం మర్చిపోవద్దు. అప్పుడే వారికి పాకిస్థాన్‌తో ఉన్న బంధం దృఢంగా ఉంటుందంటూ చేసిన వ్యాఖ్యలు ఏ రకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపించేదిగా ఉంది. నిజానికి భారత్‌లో వీరంతా ఎక్కడి వారు...ఎందుకు హిందువులతో పోరాడారు అన్న చరిత్ర కూడా చెప్పివుంటే బాగుండేది. ఓ రకంగా భారత్‌లో ఉగ్రదాడికి ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్యలు ఊపిరి పోశాయని చెప్పాలి. అలాగే కశ్మీర్ గురించి మాట్లాడుతూ.. ఈ విషయంలో మా వైఖరి స్పష్టం. కశ్మీర్ సోదరులను మేం అలా వదిలేయం అంటూ బీరాలు పలికారు. నిజానికి కాశ్మీర్ చరిత్ర,భారతదేశ చరిత్ర తెలియని మూర్ఖుడుగా అతడిని గుర్తించాలి. మొత్తంగా పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు చేసిన వారంలోపే దాడి జరిగిందన్నది గుర్తించాలి. దీంతో పాకిస్థాన్ సైన్యం, పాక్ ప్రభుత్వంపై కూడా అనుమానాలు బలపడుతున్నాయి. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను నిందిస్తూ భారతదేశం వైపు నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక వ్యాఖ్య వెలువడ నప్పటికీ.. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ముందుగానే స్పందించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు భారత ప్రభుత్వం లేదా భారత సైన్యం ఈ దాడిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ.. ఈ ఉగ్రదాడితో పాకిస్థాన్ కు ఎటువంటి సంబంధం లేదు. ఇదంతా ఆదేశంలో పుట్టిందే. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు, విప్లవాలు జరుగుతున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు.. డజన్ల కొద్దీ ఉద్యమాలు జరుగుతున్నాయి. నాగాలాండ్ నుంచి కాశ్మీర్ వరకు, దక్షిణాన ఛత్తీస్‌గఢ్, మణిపూర్ లాంటి ప్రదేశాలన్నింటిలోనూ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే పాకిస్థాన్‌పైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ నరమేధంతో మనం మరింత అప్రమత్తం కావాలి. ఉగ్రవాదుల ఏరివేతలో మరితం కఠినంగా ఉండాలి. బుజ్జగింపు రాజకీయాలు చేసే పార్టీలను ప్రజలు నిలదీయాలి. కాశ్మీర్ 370 ఆర్టికల్ గురించి మాట్లాడే కాంగ్రెస్, ఎంఐఎం , అబ్దుల్లా పార్టీలను ఎండగట్టాలి. ప్రజలు ఒక్కటిగా నిలబడి బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాలి.

## కారుణ్య అనధాశ్రమంలో సేవా కార్యక్రమం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధిఏప్రిల్:24 భద్రాద్రి లో నిర్వహింప బడుచున్న కారుణ్య అనాధ ఆశ్రమం లో ఆశ్రయం పొంది విద్య నభ్యసిస్తున్న చిన్నారులకు స్వీట్ , పుస్తకాలు,పెన్నులు,మరియు నిత్యవసర వస్తువులను అందించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ గోళ్ళ భూపతి రావు మాట్లాడుతూ భద్రాద్రి లో ఉన్న ఆశ్రమాలకు స్వచ్ఛంద సంస్థలకు తనవంతుగా సహాయం అందించడం నా బాధ్యత, మనం ఎంత ఎత్తు కు ఎదిగాము అనేది కాదు ఎంతమందికి పేదవారికి సహాయం అందించాము అనేది ముఖ్యం. ఇదే విధంగా భద్రాద్రి వాసుల కు పర్యావరణం పై కూడా అవగాహన కల్పిస్తూ మొక్కల పెంపకం వాటి అవశ్యకత మొదలగు విషయాలను ఎవరు అడిగినా కాదనకుండా అందించడం నా బాధ్యత గా తీసుకుని భద్రాద్రి ని హరిత భద్రాద్రి గా తీర్చి దిద్దాలని నేను చేస్తున్న ఈ కృషికి అందరి సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా మొక్కలకు ఎవరైనా హాని తలపెడతే వారిని వదిలే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా తెలియ చేసారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ గోళ్ల భూపతి రావు సేవాతత్పరులని అనాధ పిల్లలకు చేయూత అందించాలని వారి అభిమతం గొప్పదని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మంజుల రాణి ఆశ్రమ నిర్వాహకులు సునీల్, కుమారి రమ్య మరియు చిన్నారులు పాల్గొన్నారు.

## భక్తులూ బీ కేర్‌ఫుల్..

### ఆధ్యాత్మిక పర్యాటకంపై కన్నేసిన..

# సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన 31 ఏండ్ల ఓ ప్రైవేటు ఉద్యోగి శ్రీశైలం దర్శనానికి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నాడు. అక్కడి వైశ్యసత్రంలో గది బుక్ చేసుకున్నాడు. గదికి రూ.1,000 కాగా ఆ మొత్తం ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. అదనంగా రూ.180 జీఎస్‌టీ చెల్లించాలంటూ కాల్ వచ్చింది. కానీ జీఎస్‌టీ చెల్లించనందున రూమ్ బుక్ కాకపోవడంతో, తాను చెల్లించిన మొత్తాన్ని రిటర్న్ చేయాలని కోరాడు. రీఫండ్ ప్రక్రియ కోసం రూ.1 చెల్లించాలని అవతలి వ్యక్తి అడగగా చెల్లించాడు. ఆ తర్వాత తన అకౌంట్‌లో లక్షరూపాయలు మాయం కావడంతో కంగుతిన్నాడు. కాల్ చేసిన వ్యక్తులను సంప్రదించగా.. వారు స్పందించకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.

సోషల్‌మీడియాలో ప్రచారాన్ని నమ్మి!: ఏవైనా టూర్లు, సౌకర్యాల పేరుతో వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో వచ్చే లింకులు, ప్రకటనలు చూసి నమ్ముతున్న జనాలు ఆన్‌లైన్‌లో ముందస్తు చెల్లింపులు చేస్తున్నారు. కొన్ని ఫేక్ ట్రావెల్ ఏజెన్సీలు గూగుల్ రిజిస్టర్లతో కూడిన నకిలీ లింకులు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. బాధితులు తాము అంతదూరం వెళ్లి సదుపాయాలు తీసుకోవడం కష్టం కాబట్టి ముందుగానే ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకుని వెళ్తే ప్రయాణం సుఖవంతమవుతుందని భావిస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో తాము బుక్ చేసుకున్న తర్వాత ఎలాంటి కన్‌ఫర్మేషన్ రాకపోవడం, ఫోన్‌నెంబర్లు పనిచేయకపోవడం, రీఫండ్ అవకాశం లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందుకే స్పాన్సర్డ్ యాడ్స్‌ను నమ్మవద్దని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలని సైబర్ పోలీస్ అధికారులు చెప్తున్నారు. సంక్షిప్తమైన యూఆర్‌ఎల్ లను నమ్మవద్దని, ఏదైనా సమస్య వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఏటా భారీ మొత్తంలోనే మోసం: రోజుకో తరహా కొత్తరకం మోసాలు చేస్తూ వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న సైబర్ క్రిమినల్స్ తాజాగా ఆధ్యాత్మిక పర్యాటకంపై కన్నేశారు.దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులను టార్గెట్‌గా చేసుకుంటూ మోసాలు చేస్తున్నారు. ఇటీవల వరుసగా ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ అప్రమత్తమైంది. ఆధ్యాత్మికతను అడ్డం పెట్టుకుని మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఒక్క తెలంగాణ నుంచే ఏటా రూ.700 కోట్లు

## కమాన్ పూర్ లో పంచాయతీరాజ్ దినోత్సవం




కమాన్ పూర్ ఏప్రిల్ 24.: కమాన్ పూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాల లలిత ఎంపీ ఓ భాస్కర్ లు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. 1992లో భారత రాజ్యాంగం 73 వ చట్ట సవరణ జరిగింది. ఈ సందర్భంగా 1993 ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడింది అని ఎంపీడీవో లలిత ఎంపీ ఓ భాస్కర్ తెలిపారు. అలాగే అప్పటి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఏప్రిల్ 24 2010లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రారంభించారు. కావున ఆదినాన్ని పంచాయతీరాజ్ దినోత్సవం గా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వంశీ ఏపిఓ లావణ్య, కార్యదర్శులు నాగారం కార్యదర్శి రామ్మోహన్, కమాన్ పూర్ కార్యదర్శి రాజ్ కుమార్, మరియు ప్రవళిక, జంజర్ల అమల, ముల్కూరి తిరుపతి, తోపాటు ఇరువురాల శంకర్ మల్యాల కుమార్ రాజయ్య మిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రత ఏర్పాట్లు,రూట్ మ్యాప్ పై పోలీస్ కమిషనర్ తో చర్చిస్తున్న పెద్ది



నర్సంపేట ఏప్రిల్ 24 ఈ నెల 27 న వరంగల్ ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రూట్ మ్యాప్ కు సంబంధించి తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు,సత్యవతి రాతోడ్,మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్,ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కలిసి చర్చించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పలువురు పాల్గొన్నారు.

## ఇంటర్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చిన విద్యార్థినికి సన్మానం



మెట్ పల్లిఏప్రిల్ 24: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మెట్ పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన గాజంగి వైశాలి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ 468/470 సాధించిన సందర్భంగా బీజేపీ గ్రామ శాఖ తరపున శాలువాతో సన్మానించారు. బీజేపీ నాయకులు నలిమెల నర్సింహరెడ్డి మాట్లాడుతూ, వైశాలి ఇంటర్ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి ఇటు తల్లి దండ్రులకు, చదువుచెప్పిన ఉపన్యా సకులకు మరియు వెంపేట గ్రామానికి మంచి పేరు తీసుకవచ్చిందని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సాధించి, తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గడ్డం సాయి రెడ్డి, పెద్ది శ్రీనివాస్, తులసి శ్రీనివాస్, జోగ హరీష్, నక్కల భూమేశ్వర్ గౌడ్, గాజంగి వివేక్, గాజంగి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## లగ్జరీ బస్సు ఢీకొని మహిళ మృతి

### మరొక మహిళకు తీవ్ర గాయాలు



విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరొక మహిళ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందజేసిన సమాచారం ప్రకారం, కంచరపాలెం సమీపంలోని బర్మా క్యాంపు కు చెందిన నిమిడిపల్లి మేరీ (62), ఆమె కుమార్తె సుధారాణి (42) ఇద్దరూ కలిసి స్కూటీపై తెల్లవారుజామున కంచరపాలెంలోని చర్చికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఊర్వశి జంక్షన్ వద్ద రోడ్డును క్రాస్ చేస్తుండగా, విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వస్తున్న లగ్జరీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో స్కూటీపై వెనుక కూర్చున్న మేరీ అక్కడికక్కడే మరణించగా, స్కూటీ నడుపుతున్న కుమార్తె సుధారాణి కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అక్కడికి చేరుకొని సుధారాణిని ఆసుపత్రికి తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సిఐ దాశరథి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి పార్వతీపురం వెళ్ళవలసిన ఇందిరా లగ్జరీ బస్సు అతివేగంగా రావడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేస్తుందని చెప్పారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మృతురాలు మేరీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ మార్చురీకి తరలించడం జరిగిందని తెలిపారు.

## 25 ఏండ్ల గులాబీ పండుగకు 16 ఎడ్లబండ్లు



రాయపర్తి: ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సూర్యా పేట జిల్లా నిమ్మకల్లు నుంచి 16 ఎడ్లబండ్లు బయలుదేరినవి. గురువా రం రోజు ఉదయం రాయపర్తి మండలం ఊరి శివారుకు చేరుకున్న ఎడ్లబండ్లకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘనంగా స్వాగ తం పలికారు. ఎర్రబెల్లి ఎడ్లబండి నడిపికార్యకర్తలు,ప్రజలకు రజతో త్సవ సభకు అధిక సంఖ్యలోపాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రంగు కుమార్, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, మాజీ ఎంపిటిసి రామచందర్, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి,పూస మధు, ముద్రకబోయిన సుధాకర్, చందు రాము, ఉబ్బని సింహాద్రి, ఎల్ల స్వామి, ఎండి అక్బర్, అశ్రఫ్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహిళల రక్షణకే షీ టీంలు



కమాన్ పూర్ (పాలకుర్తి ) ఏప్రిల్ 24. మహిళల రక్షణకే షీ టీంలు పనిచేస్తున్నాయని ఎస్సై లావణ్య అన్నారు. గురువారంరామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ ఐలావణ్య ఆధ్వర్యంలో పాలకుర్తి లోని వంద రోజుల పని చేసే మహిళలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతు ందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, మరియు సీనియర్ మెట్ కనుకయ్య మరియు మహిళలు పాల్గొన్నారు.

# అటు ఉష్ణం.. ఇటు శీతలం!



### భూతాపంతో ఉష్ణోగ్రతల్లో ఆకస్మిక మార్పులు
### ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం
### భవిష్యత్తులో మరింత తీవ్రతరం

ఢిల్లీ : వాతావరణంలో మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతల్లో ఆకస్మిక మార్పులు (టెంపరేచర్ ఫ్లిప్స్) చోటుచేసుకుంటున్నట్టు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూతాపం వల్ల ఒక్కసారిగా అత్యంత వేడి నుంచి శీతలం.. శీతలం నుంచి అత్యంత వేడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటి పరిణామాలు మానవులకు, వాతావరణానికి తీవ్ర ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల వల్ల 1961 నుంచి ప్రపంచవ్యాప్తంగా 60 శాతం ప్రాంతాలు దీని ప్రభావానికి లోనయ్యాయని, ఇలాంటి ఆకస్మిక ఉష్ణోగ్రతల మార్పులు సర్వసాధారణమయ్యాయని, తీవ్రంగా, వేగంగా సంభవిస్తున్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ మేరకు 'నేచర్ కమ్యూనికేషన్స్'లో అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.
కర్బన ఉద్గారాలు తగ్గకపోతే%: 2012 మార్చిలో ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఆకస్మికంగా -10 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2020 సెప్టెంబర్‌లో రాకీ పర్వతాల్లో ఒక్కరోజు వ్యవధిలో 20 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోయినట్టు అధ్యయనంలో వెల్లడైంది. ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయి, తీవ్రంగా మంచు కురిసినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఆకస్మికంగా మార్పులకు లోనయ్యే ప్రమాదముందని వారు చెబుతున్నారు. కర్బన ఉద్గారాల వాడకం తగ్గకపోతే ఈ శతాబ్దం చివరి నాటికి ప్రమాదపుటంచుల్లో ఉన్నవారి శాతం 100కు చేరుతుందని హెచ్చరిస్తున్నారు.

# ధరణి ఇబందులు తొలగించేదుకే భూ భారతి..



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి ఏప్రిల్ 24: ధరణిలో ఉన్న లోపాల దృష్ట్యా రైతులు ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం మొగుళ్ల పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టం యొక్క అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లో పభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వే యర్ ద్వారా హద్దులు తో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పహణి కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధరణి వచ్చిన తరువాత పహణిలో నమోదులు జరగలేదని తెలిపారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, గత 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12-10-2020 నుండి 10-11-2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం సన్న చిన్నకారు రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డిఓ విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ప్రకారం భూ హక్కులు జారీ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవి, తహశీల్దార్ సునీత, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# చేపల జాతరతో గుబాళింపు

### ఏటా జరుపుకునే పండగలో ఐకమత్యం



ఏలూరు,ఏప్రిల్24:పండగలు,జాతరలు అందరినీ కలిసికట్టుగా ఉంచే సంప్రదాయాలుగా చూడాలి. కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి తగ్గట్టుగా .... ఏలూరు ఏజెన్సీలో చేపల జాతర జరిగింది. ఏకంగా 10 గ్రామాలు కలిసి చేపల జాతర జరుపుకున్నారు.. ప్రతీ ఇంట్లోనూ చేపల పులుసు గుభాళింపే..! ఏలూరు ఏజెన్సీలో ప్రజలు ఏడాదికి ఒక్కసారి సమిష్టిగా ఊరి చెరువులో చేపల జాతర నిర్వహిస్తుంటారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పెట్టడం జాతరలా ఉంటుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం నీళ్లలోకి దిగి, చేపలను పట్టి, వాటిని కుప్పలుగా పోసేవాళ్లు. సమానంగా జరిగే పంపకాలు.. ఇదే సమయంలో వినిపించే చలోక్తులు, సరదాగా సాగే దెప్పిపొడుపులు, అన్యాయం జరిగిందంటూ సాగే అలకలు. చిన్నా, పెద్దా , బాబాయ్, పిన్ని, అత్తా మామ అంటూ వినిపించే పలకరింపులు.. మొత్తం ఒక జాతరలా కనిపిస్తుంది. వచ్చిన చేపలన్నిటినీ అంతా సమానంగా పంచుకుని వండుకుని తింటారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటా చేపల వంటకాలే..! ఈ ఏడాది కూడా అదే వాతావరణంలో కుక్కునూరు మండలం చీరవల్లిలో చేపలను పెట్టారు. ఈ చెరువు పరిసరాల్లో దాదాపు 10 గ్రామాల ప్రజలు నివసిస్తుంటారు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండే చెరువులు వేసవిలో నీరు ఇంకిపోయి వెలవెల పోతుంటాయి. అదే సమయంలో గిరిజనులు అక్కడకు చేరుకుని చెరువులో దిగి చేపలను పెడతారు. బచ్చా, శీలావతి, కొరమేను, వాలుగా ఇలా చాలా రకాల చేపలు దొరికాయి. ఇక, వాటిని పంచుకుని ఎవరి వాటా వాళ్లు చేపలను తామర ఆకుల్లో ఉంచుకుని ఇళ్లకు తీసుకువెళ్లారు. ఇక మంచి ఘుమఘుమలాడే చేపల కూర వాసనలతో కుక్కునూరు పరిసర ప్రాంతాలు గత రెండు రోజులుగా గుభాళించాయి..

# ఉగ్ర ముతా దాడులను నిరసిస్తూ.. న్యాయవాదుల విధుల బహిష్కరణ



గోదావరిఖని:కాశ్మీర్ లోని పహల్గాం లోయలో ఉగ్రమూకల ఊచకోతను నిరసిస్తూ ఖని బార్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ మేరకు 3 మున్సిఫ్ కోర్ట్ లతో పాటు, సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, అదనపు జిల్లా న్యాయస్థానం లో న్యాయ వాదులు విధులు బహిష్కరించటం తో కోర్ట్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం న్యాయవా దులు మున్సిఫ్ కోర్ట్ కాంప్లెక్స్ నుంచి ఖని ప్రధాన చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లోయలో, దేశం లో అశాంతిని నెలకొల్పేందుకు కొన్ని దృష్ట శక్తుల పన్నాగాలను దేశ ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. ఉగ్రవాద దాడుల్లో మృతిచెందిన 27 మంది అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్,ప్రధాన కార్యదర్శి సిరిగ సంజయ్ కుమార్ లతో పాటు నాయకులు ఎండి.ఉమర్, ముచ్చుకుర్తి కుమార్, ఎరుకల ప్రదీప్ కుమార్, రాగం శ్రీధర్, పులిపాక రాజ్ కుమార్, సబా తబస్సుం, పంగ శంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు జాగిరి రాజయ్య, గొర్రె రమేష్, మేడ చక్రపాణి, చందాల శైలజ ,అరె మధు, కొసన శ్రీనివాసరావు, రంగు శ్రీనివాస్, శీతకారి చంద్రశేఖర్, రామటెంకి శ్రీనివాస్, జూపాక వెంకటేశ్వర్లు, చెలికల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### నిత్య అన్నదాన సత్రానికి 4 ఆవుల దానం చేసిన హైదరాబాద్ నివాసి

# కోనప్ప ధన్యవాదాలు

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రయాణ ప్రాంగణం ఎదురుగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న "కోనేరు నిత్య అన్నదాన సత్రం" వేల మందికి భోజనం అందిస్తూ సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సత్రం గురించి తెలిసిన హైదరాబాద్ నివాసి హేమంత్ తన వంతు సేవగా నాలుగు గిరి ఆవులను దానం చేశారు. ప్రతి ఆవు రోజుకు 10 లీటర్ల పాలు ఇచ్చే విధంగా ఉంటూ, ఈ పాలతో తయారుచేసిన పెరుగు భోజనానికి వచ్చే ప్రజలకు అందించనున్నారు. మొదట రెండు ఆవులను అందజేసిన హేమంత్, త్వరలో మరిన్ని రెండు ఆవులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోనప్ప ఆవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి హేమంత్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "అన్నదానంలో భాగస్వాములైనందుకు గర్వంగా ఉంది" అంటూ హేమంత్ ఆనందం వ్యక్తం చేశారు.

# ఇక పై భూముల పై మోసాలు చెల్లవు


### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్





కొడిమ్యాల, భూ భారతి చట్టంతో భూములపైమోసాలు ఇక చెల్లవని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఆరెపల్లి ఎల్ కే గార్డెన్ లో భూ భారతి పై అవగాహనా సదస్సు నిర్వహించారు. గతంలో లాగా ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి అమ్మడం, ఒకరి భూమిని ఒకరు ఆక్రమించుకోవడం లాంటి ఎన్నో మోసాలు జరుగా యని ఇప్పుడు అలాంటి వాటికి తావు లేదని అన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం అందరు వినియోగించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఈ పథకం ఎంతో మేలుచేస్తుందని రైతులు ప్రాణం కన్నా ఎక్కువ భూములకు విలువ నిస్తారని భూతల్లి నమ్ముకున్న రైతులకు ఈ పథకం అన్నివిధాలుగా ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గడ్డం జీవన్ రెడ్డీ, ఫాక్స్ ఛైర్మన్ రాజా నర్సింగరావు, బండ రవీందర్ రెడ్డీ, మాజీ ఫాక్స్ ఛైర్మన్ గుడిమల్లి ఖార్జున రెడ్డీ, మాజీ సర్పంచ్ పిడుగు ప్రభాకర్ రెడ్డీ, మహిపాల్ రెడ్డీ, అధికారులు ఆర్ధివో మధు సుధన్, తహసీల్దార్ రమేశ్ ఎం పి డి వో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

### అంబలి పంపిణీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి24:** బెజ్జూర్ మండలంలోని లంబాడిగూడ (మర్తిడి) గ్రామ వారసంతలో ఈరోజు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు పౌష్టికాహారంగా అంబలిని అందిస్తూ, కోనప్ప ప్రజాప్రతినిధిగా తన సేవా పరమార్థాన్ని మరోసారి చాటారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు, పార్టీ కార్యకర్తలు, కోనప్ప అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానికంగా మంచి స్పందన లభించిన ఈ కార్యక్రమం ప్రజల్లో సేవా భావాన్ని పునరుద్ధరించింది.



# ఉగ్రదాడి ఘటన అమానుషం



మంథని ప్రతినిధి,ఏప్రిల్ 24: జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి ఘటన అమానుషమని మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి ఎల్ ఎన్ హరిబాబు పేర్కొన్నారు. గురువారం మంథని కోర్టు ప్రాంగణంలో అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా నియామకమైన సివిల్ జడ్జి భవాని తో బార్ అసోసియేషన్ సభ్యులు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సయేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రఘోత్తం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సీనియర్ జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### స్మితా సబర్వాల్ తప్పేమీ లేదు.. వాస్తవాన్నే రీట్వీట్ చేశారు.. దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా ట్వీట్లు చేస్తున్నారని సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌పై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్న వేళ.. దానం నాగేందర్ ఆమెకు మద్దతుగా నిలిచారు. స్మితాసబర్వాల్ చేసిన రీట్వీట్‌లో తప్పేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితినే ఆమె రీట్వీట్ చేశారని పేర్కొన్నారు. అంతేగానీ ఆమె చేసిన పనిలో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఏమీ లేదని వివరించారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ కమ్యూనిటీ హాలులో జలమండలి, ఇతర అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. కంచ గచ్చిబౌలి విషయంలో సీఎస్ శాంతికుమారిపై సుప్రీంకోర్టు సీరియస్ అవ్వడం బాధించిందని తెలిపారు. ఆమెకు మంచి అధికారిగా పేరు ఉందని, కోర్టు చివాట్లతో చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కూడా దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను ప్రజలు చూడాలని ఆశపడుతున్నారని.. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారని అభిప్రాయపడ్డారు.

# పాశవిక దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

### టిపిసిసి సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్



మెట్ పల్లిఏప్రిల్ 24: ఆహ్లాదకరమైన వాతావరణం లో, రమణీయ ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఆదమరచి ఉన్న పర్యాటకులను ఉగ్రమూకలు తుపాకులతో విరుచుకుపడి, కాల్చివేయడం అత్యంత హేయమైన చర్య అని, ఇంతటి పాశవిక దాడికి పాల్పడ్డ ఉగ్ర దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ అన్నారు. హైదరాబాదు నుండి చరవాణి ద్వారా మెట్ పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వారం క్రితం వివాహం చేసుకొని హనీమూన్ కు పహాల్గం వెళ్లిన వినయ్ సర్వాల్ దంపతులపై మృత్యువు ఉగ్రదాడి రూపంలో వారి బంధాన్ని ముక్కలు చేయడం, భర్త మృతదేహం ముందు భార్య విలపించే దృశ్యం, యావత్ దేశాన్ని కలచివేసిందని కరంచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండెందుకు కేంద్ర ప్రభుత్వం కఠినతరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మహారాష్ట్రలో నీటి కటకట..



నాసిక్: బీజేపీ పాలిత మహారాష్ట్రలో చాలా జిల్లాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా నాసిక్ సహా విదర్భలోని పలు జిల్లాల్లో చాలా గ్రామాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. వేసవి ఇంకా విజృంభించక ముందే రాష్ట్రంలో చాలాచోట్ల నీటి వనరులు అడుగంటి పోయాయి. దీంతో మహిళలు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి ఇండ్లకు నీళ్లను మోసుకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నాసిక్ జిల్లా బొరిచివరి గ్రామ మహిళలైతే గుక్కెడు నీళ్ల కోసం ఎండిపోయిన బావిలోకి ప్రమాదకరంగా తాడు సాయంతో దిగుతున్నారు. నీళ్ల కోసం పోరాటం తమకు నిత్య కృత్యమైందని వారు వాపోతున్నారు. అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యావత్మల్‌లోని పార్ధీ తెగ మహిళలూ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలో తాగునీటి సమస్యపై విపక్ష కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందిస్తామన్న మోదీ ప్రభుత్వం మాటలు పోస్టర్లకే పరిమితయ్యాయని విమర్శించింది.

# ఆర్యవైశ్య సంఘం ఎన్నికలపై వివాదం

### -హైకోర్టుకు ఎక్కిన ప్రత్యర్థులు..




మంథని ప్రతినిధి,ఏప్రిల్ 24: మంథని ఆర్యవైశ్య సంఘం ఎన్నికల వివాదం చిలికి చిలికి గాలివానైంది ప్రత్యర్థులు హైకోర్టు మెట్లెక్కారు మంథని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నియమ నిబంధనల ప్రకారం జరగలేదని సముద్రాల రమేష్ హైకో ర్టులో కేసు వేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే ఎలాంటి అర్హత లేని రాష్ట్ర మహాసభ అనుబంధ రిజిస్ట్రేషన్ తప్పుడు బైలా తో ఎన్నికలు నిర్వహించడమే కాకుండా నామినేషన్ ప్రక్రియలో కూడా అక్రమాలకు పాల్పడినట్లు పిటిషన్ లో పేర్కొన్నారు. తొలుత అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తన నామినేషన్ను అంగీకరించిన ఎన్నికల అధికారులు ఓటింగ్ సమయంలో ఒత్తిడికి లొంగి నిబంధనల కు విరుద్ధంగా తనను పోటీ నుంచి తప్పించి తన ప్రత్యర్థి అభ్యర్థిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ ఫైల్ చేయగా పిటిషన్ ను స్వీకరించిన హైకోర్టు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు, ఎన్నికల అధికారులకు, అధ్యక్షుడు గా ప్రకటించిన ఎల్లంకివంశీధర్ కు పర్సనల్ గా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈ కేసును జూన్ 7వ తేదీకి కోర్టు వాయిదా వేసినట్లు పిటిషన్ దారుడు సముద్రాల రమేష్ తెలిపారు.






గత రెండేళ్లుగా తెలుగు సినిమాలు బ్రేక్‌నిచ్చింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ప్రస్తుతం ఈ భామ తమిళ ఇండస్ట్రీపై ఎక్కువగా దృష్టి పెడుతున్నది. తాజాగా ఆమె తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంలో ఓ భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. 'లక్కీ భాస్కర్'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. త్వరలో ఆయన తమిళ అగ్ర హీరో సూర్యతో ఓ సినిమా చేయబోతున్నారు. మారుతీ కార్లకు సంబంధించిన నేపథ్య కథాంశంతో తెరకెక్కించనున్న బయోపిక్ ఇదని సమాచారం. '796 సీసీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో కథానాయికగా చాలా మంది పేర్లు వినిపించాయి. తాజా సమాచారం ప్రకారం కీర్తి సురేష్‌ను ఫైనల్ చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ భారీ వ్యయంతో తెరకెక్కించనుంది. మే రెండో వారం నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుకానుందని సమాచారం.

# దర్శకుడికి ఖరీదైన బహుమతి ఇచ్చిన నాని..



ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చి స్వయంకృషితో స్టార్ హీరోగా ఎదిగారు నాని. చూడటానికి పక్కింటి అబ్బాయిలా కనిపించే నాని ఎక్కువగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగాడు. సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా ప్రేక్షకులకి విభిన్నమైన సినిమాలని అందించాలని ఎప్పుడు తాపత్రయ పడుతుంటారు. ఇక ఇప్పుడు నాని మాస్ హీరోగా ఎదిగేందుకు కృషి చేస్తున్నాడని అనిపిస్తుంది. హిట్ 3, ది ప్యారడైజ్ అనే చిత్రాలతో నాని ప్రేక్షకులకి డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్నట్టు తెలుస్తుంది. నాని నటించిన హిట్ 3 మూవీ మరి కొద్ది రోజులలో ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ సినిమాలో అర్జున్ సర్కార్ అనే పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. గతంలో ఎప్పుడు కనిపించని పాత్రలో కనిపించి అలరించబోతున్నట్టు తెలుస్తుంది.ఇక నాని హీరోగానే కాకుండా అటు నిర్మాతగానూ సక్సెస్ అవుతున్నారు. కొత్త వాళ్లని పరిచయం చేస్తూ మంచి హిట్స్ కూడా అందిపుచ్చుకుంటున్నారు. ఇటీవల తన సొంత బ్యానర్ పై కోర్టు అనే చిన్న చిత్రాన్ని నిర్మించారు నాని. చిన్న సినిమాగా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ సినిమాతోనే రామ్ జగదీష్ అనే మరో కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. కోర్టు చిత్రంలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించగా, ఈ సినిమా ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. ప్రస్తుతం ఓటీటీలో కూడా ఈ మూవీ స్ట్రీమ్ అవుతుండగా, ఇందులోను మంచి రెస్పాన్స్ వస్తుంది. అయితే కోర్టు మూవీ మంచి విజయం సాధించిన నేపథ్యం లో చిత్ర నిర్మాత నాని దర్శకుడికి ఖరీదైన కారుని బహుమతిగా ఇచ్చారట. నాని ఈ మధ్య కాలంలో చాలా ఇంటర్వ్యూలలో పాల్గొన్నా కూడా ఎక్కడా ఈ విషయాన్ని రివీల్ చేయలేదు. కోర్టు డైరెక్టర్ ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని రివీల్ చేసాడు. నాని చేతుల మీదుగా కారు బహుమతిగా తీసుకోవడం పెద్ద అచీవ్ మెంట్ అని చెప్పిన ఆ దర్శకుడు..ఈ విషయాన్ని ఆనందంగా అందరికీ చెప్పుకోవాలని ఉందని.. కానీ గిఫ్ట్ ఇచ్చి ఇలా బయటకు చెప్పుకోవడం నానికి ఇష్టం లేదని.. అందుకే ఎవరికీ చెప్పలేదని పేర్కొన్నారు.

# అక్షరాలా 400 నిమిషాలు..

## అభిమానులకు నాగ చైతన్య ఊహించని సర్ప్రైజ్!




చాలా కాలం తర్వాత అక్కినేని నాగచైతన్య 'తండేల్' చిత్రం తో భారీ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి అక్కినేని అభిమానుల్లో ఫుల్ జోష్ ని నింపిన సంగతి తెలిసిందే. అంతకు ముందు నాగ చైతన్య నటించిన సినిమాలు మాత్రమే కాదు, అక్కినేని కుటుంబ హీరోల సినిమాలన్నీ బాక్స్ ఆఫీస్ వద్ద డబుల్ డిజాస్టర్స్ గా నిలిచాయి. అభిమానులు అక్కినేని హీరోల బాక్స్ ఆఫీస్ స్టామినా పై ఆశలు వదిలేసుకుంటున్న సమయంలో నాగ చైతన్య 'తండేల్' ద్వారా వాళ్లకు సరికొత్త ఆశలు చిగురించేలా చేసాడు. ఈ సినిమా అక్కినేని



కుటుంబానికి మొట్టమొదటి వంద కోట్ల సినిమా అని చెప్పొచ్చు. ఈ చిత్రానికి ముందే నాగ చైతన్య 'దూత' అనే వెబ్ సిరీస్ ద్వారా కం బ్యాక్ ఇచ్చాడు. విక్రమ్ కే కుమార్ దర్శకత్వం లో తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అయ్యి సెన్సేషనల్ హిట్ గా నిల్చింది.అమెజాన్ ప్రైమ్ సంస్థలో అత్యధిక వ్యూస్ ని సొంతం చేసుకున్న సిరీస్ గా ఇది సరికొత్త రికార్డు ని నెలకొల్పింది. ఈ సిరీస్ కి సీక్వెల్ కూడా త్వరలోనే రాబోతుంది. ఈ సీక్వెల్ ఎప్పుడు వస్తుంది అనే దానిపై క్లారిటీ రాలేదు కానీ, నాగ చైతన్య చేసిన మరో వెబ్ సిరీస్ గురించి క్లారిటీ వచ్చేసింది. ప్రస్థానం, వెన్నెల, రిపబ్లిక్ లాంటి అద్భుతమైన చిత్రాలను టాలీవుడ్ కి అందించిన దేవాకట్టా, నాగ చైతన్య తో మయసభఅనే పొలిటికల్ వెబ్ సిరీస్ ని రూపొందించాడు. సుమారుగా 400 నిమిషాలు, అంటే 6 గంటలకు పైగా ఉండే ఈ వెబ్ సిరీస్ ని సోనీ లివ్ సంస్థ స్ట్రీమింగ్ చేయబోతుంది. ఈ వెబ్ సిరీస్ గురించి దేవాకట్టా మాట్లాడుతూ ఈ ఏడాది చివర్లో ఈ వెబ్ సిరీస్ ని సోనీ లివ్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పుకొచ్చాడు.దేవాకట్టా పొలిటికల్ థ్రిల్లర్స్ ని తీయడం లో సిద్ధహస్తుడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనంత గ్రిప్పింగ్ గా సౌత్ లో పొలిటికల్ మూవీస్ ఎవ్వరూ చెయ్యలేరు అని చెప్పడం లో ఎలాంటి అతిశయోక్తి లేదు. ముఖ్యంగా ఆయన రాసే డైలాగ్స్ చిరకాలం మన మనస్సులో గుర్తుండిపోయేలా ఉంటాయి. అలాంటి డైరెక్టర్ తో ఇలాంటి వెబ్ సిరీస్ చేయడాన్ని చూస్తుంటే మరోసారి నాగచైతన్య కుంభస్థలం బద్దలు కొట్టేలా ఉన్నాడని అంటున్నారు విశ్లేషకులు. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ కి సంబంధించి మరికొన్ని వివరాలు తెలియనున్నాయి. ఇకపోతే నాగ చైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ తెరకెక్కిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ లో నటిస్తున్నాడు. శరవేగంగా షూటింగ్ కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ సినిమా ఆడియన్స్ ని షాక్ కి గురి చేసేలా ఉంటుందని అంటున్నారు. ఈ ఏడాదిలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన హన్సిక మోత్వానీ హారర్ థ్రిల్లర్ 'గార్డియన్'..




దేశముదురు నటి హన్సిక హీరోయిన్‌గా నటించిన చిత్రం గార్డియన్. శబరి గురు శరవణన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. 2024 మార్చి 8న తమిళంలో విడుదలై సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ చిత్రం ప్రస్తుతం తమిళంలో మాత్రమే స్ట్రీమింగ్ అవుతుండగా.. తాజాగా తెలుగులోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. భవాని మీడియా ద్వారా ఈ సినిమా తెలుగులోకి అందుబాటులోకి వచ్చింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రానికి సామ్ సి.ఎస్. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా.. కె.ఏ. శక్తివేల్ సినిమాటోగ్రఫీ అందించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అపర్ణ (హన్సిక) చిన్నతనం నుంచి దురదృష్టం వెంటాడుతుంది. ఏది కోరుకున్నా అది సాధ్యం కాదు. చివరకు దేవుని హారతి తీసుకోవాలనుకున్నా, అపర్ణ చేతులు జోడించగానే దీపం ఆరిపోతుంది. ఆమె ప్రేమ బ్రేకప్‌తో ముగుస్తుంది. అందరూ ఆమెను "అన్‌లక్కీ అపర్ణ" అని పిలుస్తారు. ప్రాజెక్ట్ పనిలో భాగంగా ఓ కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ దగ్గరకు వస్తుంది అపర్ణ. అక్కడ ఆమెకు ఓ క్రిస్టల్ (మెరుపు రంగు రాయి) లభిస్తుంది. అప్పటి నుంచి అపర్ణ జీవితం పూర్తిగా మారిపోతుంది. అపర్ణ (హన్సిక) ఏది కోరుకుంటే అది జరిగిపోవడం ప్రారంభమవుతుంది. కే అనే పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఆమెకు ఉద్యోగం లభిస్తుంది. అపర్ణకు దూరమైన ప్రేమికుడు ప్రభ కూడా అక్కడే ఆమెకు మళ్లీ తారసపడతాడు. అభిప్రాయ భేదాలు తొలగిపోయి వీరిద్దరూ ఒకటవుతారు. అయితే, ఆఫీసులో ప్రాజెక్ట్ మేనేజర్ మరియు కంపెనీ హెడ్ తమ్ముడు కారణంగా అపర్ణతో పాటు మిగిలిన ఉద్యోగులందరూ ఇబ్బందులు పడతారు. వారిద్దరూ చనిపోతే బాగుంటుందని అపర్ణ కోరుకుంటుంది. అపర్ణ కోరినట్లు గానే, ఆమె కళ్ల ముందే వారిద్దరూ దారుణంగా చనిపోతారు. అపర్ణ మనసులో కోరిన కోరికలన్నీ ఎలా నెరవేరుతున్నాయి? ఆ కోరికలకు ఆ క్రిస్టల్‌కు ఉన్న సంబంధం ఏమిటి? ఆ క్రిస్టల్‌లో బంధించబడిన మీరా అనే ఆత్మ ఎవరు? గౌతమ్, త్యాగు మరియు వారి మరో ఇద్దరు స్నేహితులపై మీరా పగతో రగిలిపోవడానికి కారణం ఏమిటి? మీరా ఎలా చనిపోయింది? మీరా జరిగిన అన్యాయంపై అపర్ణ ఎలా ప్రతీకారం తీర్చుకుంది? మీరా కూతురికి గార్డియన్‌గా ఉండటానికి అపర్ణ ఒప్పుకుందా లేదా? ఇదే "గార్డియన్" సినిమా కథ.

# మహేష్ బాబుకి, మణిశర్మకి మధ్య గ్యాప్..ఇద్దరిలో తప్పు ఎవరిది?



సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్ టాప్ హీరోలలో ఒకరు. ఇప్పుడు రాజమౌళితో చేస్తుండగా, ఈ సినిమాతో మహేష్ బాబు క్రేజ్ ఎల్లలు దాటడం ఖాయంగా కనిపిస్తుంది. ఇక ఒకప్పుడు టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు మణిశర్మ. ఎంతో మంది హీరోలకి అద్భుతమైన బాణీలు అందించి సరికొత్త ట్రెండ్ కూడా సృష్టించారు. మహేష్ బాబు కెరీర్ మొదట్లో మంచి మ్యూజిక్ తో సూపర్ హిట్ సాంగ్స్, అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు మణిశర్మ. ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన సినిమాలన్నీ దాదాపు సూపర్ హిట్స్ అని చెప్పాలి. ఇప్పటికీ ఆ పాటలు ఎక్కడో చోట వినిపిస్తూనే ఉంటాయి.మురారి, ఒక్కడు, అతడు, అర్జున్, ఖలేజా, పోకిరి.. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన చిత్రాలు చాలానే ఉన్నాయి. అన్ని పాటలు కూడా ఆల్‌టైమ్ హిట్సే. ఇది బాలేదు అని చెప్పే ప్రసక్తే లేదు. అయితే ఇంత బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో ఈ మధ్య సినిమాలు రావడం లేదు. ఖలేజా తర్వాత మళ్లీ మహేష్ బాబు సినిమాకి పని చేయలేదు మణిశర్మ. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు మాత్రం జస్ట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఎక్కువ సినిమాలు చేసిన వారిద్దరి మధ్య మంచి బాండింగ్ ఉండే ఉంటుంది. కాని ఎందుకో ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. ఓ సందర్భంలో ఇంటర్వ్యూలో లో పాల్గొన్న మణిశర్మ.. మహేష్ బాబుతో గ్యాప్ గురించి కామెంట్ చేస్తూ%ా% ఏం జరిగిందో ఏమో తెలియదు. ఎందుకు దూరం పెట్టారో కూడా నాకు తెలియదు అని అన్నారు. మా ఇద్దరి కాంబోలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. పొరపాటు ఏంటనేది నాకు తెలియదు. తప్పు నాది అయ ఉండడం వల్లనే అలా జరిగిందేమో. నేను తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. వాళ్లెవరు కూడా నాకు ఏం జరిగిందో చెప్పలేదు. గ్యాప్ మాత్రం మా ఇద్దరి మధ్య అలా కంటిన్యూ అవుతుంది అని మణిశర్మ స్పష్టం చేశారు. మహేష్ బాబు మణిశర్మ కాంబో లో ఎన్నో సూపర్ హిట్స్ రాగా, తిరిగి ఆ కాంబో ప్రేక్షకులని అలరించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.